
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 మే 2025 | 5





కదలాలి కార్మికా!



ఆయారే మేడే రాజమహేంద్రవరంలో జెండా వందనం .. చిత్రంలో కార్మికులతో కలిసి ర్యాలీలో సీపీఐ నారాయణ

ఆయారే మేడే.. ఆయుధమై నేడే అంటూ కార్మికులు కదంతొక్కారు.. ఊరూవాడా నినాదాలతో మార్మోగించారు.. ప్రపంచ కార్మిక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.. కార్మికులంతా ఎర్రచొక్కాలు వేసుకుని.. ఎర్రజెండాలు పట్టుకుని కార్మికలోకం ఐక్యం కావాలి.. అనుకున్నది సాధించాలి... అందరూ కలిసి రావాలంటూ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.. జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు.

7

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (గురువారం)
కనిష్ఠం : 26.0

నేటి నుంచి బీచ్ కబడ్డీ పోటీలు

8 మందికి డీటీలుగా పదోన్నతి

మురమళ్లలో బ్రహ్మోత్సవాలు

6

ఆశలు.. గల్లాన్!



డీసీసీబీ పీఠం జనసేనదే..

- ఇంతకాలం టీడీపీకేనని నిర్ణయం
- చివర్లో అనూహ్య మార్పు
- పశ్చిమ డీసీసీబీ టీడీపీ..
- తూర్పు జనసేనకు పంపకాలు
- రెండ్రోజుల్లో అధికారిక ప్రకటన
- పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డికి ఛాన్స్!
- నిరాశలో టీడీపీ ఆశావహులు
- కోనసీమకు డీసీఎంఎస్ చైర్మన్
- ఇద్దరు టీడీపీ నేతల పరిశీలన

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవీ పంపకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఆఖర్లో అనూహ్యంగా ఈ కీలక పదవిని జనసేన ఎగరేసుకుపోయింది.ఈ కుర్చీ టీడీపీ తీసుకోవాలని తొలుత నిర్ణయం జరగ్గా ఆఖరి నిమిషంలో సమీకరణాలన్నీ మారిపోయాయి. టీడీపీకి బదులు జనసేనకు డీసీసీబీ ఇచ్చేయాలని నిర్ణయం జరిగింది. పశ్చిమ డీసీసీబీ టీడీపీ, తూర్పుగోదావరి డీసీసీబీ జనసేన తీసుకునేలా ఎట్టకేలకు నిర్ణయించారు. జనసేన నుంచి పిఠాపురం ఇన్‌ఛార్జి మర్రెడ్డికి పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.అటు చైర్మన్ కుర్చీ టీడీపీదేనని ఇంతకాలం భావించిన ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు. కాగా డీసీఎంఎస్ చైర్మన్ పదవికి కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఆఖర్లో అనూహ్యంగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ అంటే అదో హోదా. రాష్ట్రంలో అతిపెద్ద డీసీసీబీ తూర్పుగోదావరిదే. కూటమి అధికారంలోకి రావడంతో ఈ పదవి దక్కించుకోవాలని మూడు నెలలుగా అనేక మంది టీడీపీ నేతలు పావులు కదిపారు. ఉభయగోదావరి జిల్లాల నేతలు అధిష్ఠానం వద్ద పంచాయతీ పెట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు..తూర్పుగోదావరి టీడీపీకి ఇచ్చేలా కొంత కాలం కిందట నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు టీడీపీ ఆశావహులు తమ ప్రయత్నాలు ఆరంభించారు. ప్రధానంగా జడ్పీ చైర్మన్‌గా గతంలో పనిచేసిన జ్యోతుల నవీన్‌కు అవకాశం వస్తుందని ప్రచారం జరిగింది. కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ బాబి అయితే తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ రానందున డీసీసీబీ అయినా సాధించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వారి నుంచి లేఖలు సేకరించారు. కోనసీమ నుంచి మెట్ల రమణబాబు, మెట్ట నుంచి తోట నవీన్ తదితరులు ఆశలు పెంచుకున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు డీసీసీబీ నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ప్రకటించినప్పుడు ఆ జాబితాలో రెండు ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల చైర్మన్ల ప్రకటన వాయిదా పడింది. తీరా పశ్చిమ డీసీసీబీ జనసేనకు బదులు టీడీపీకి ఇవ్వాలనే ఒత్తిడి పెరగడంతో సమీకరణలు మార్చాల్సి వచ్చి ఉమ్మడి తూర్పు చైర్మన్ పేరు వాయిదా వేశారు. మూడు రోజు లుగా ఈ రెండు జిల్లాలకు సంబంధించిన టీడీపీ నేతలతో పార్టీ పెద్దలు అమరావతిలో చర్చలు జరిపారు. పశ్చిమ డీసీసీబీ కుర్చీ టీడీపీ తీసుకుని ఉమ్మడి తూర్పు కుర్చీని జనసేనకు కేటాయించాలని తీర్మానించారు.అనేక తర్జనభర్జనల తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి డీసీ సీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేయాలని టీడీపీ నిర్ణయించింది. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ఈసారి కి డీసీసీబీ ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఇచ్చేలా అధిష్ఠానాన్ని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. తాజా నిర్ణయంపై టీడీపీలో కొందరు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధిష్ఠానం వద్ద ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇదే ఏకరువు పెట్టినా పొత్తు ధర్మం పాటించాల్సిందేనని అధిష్ఠానం తెగేసి చెప్పింది. ఆశావహులు తమకు అన్యా యం జరిగిందంటూ ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ ఎవరో..

డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేసిన నేపథ్యంలో డీసీఎంఎస్ చైర్మన్ పదవిని టీడీపీ తీసుకోవాల్సి ఉంది. దీంతో ఈ పదవికి టీడీపీ నుంచి ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ జనసేన, డీసీఎంఎస్ చైర్మన్ టీడీపీ తీసుకోవాలనే నిర్ణయం జరగడంతో ఉమ్మడి తూర్పులో డీసీసీబీ చైర్మన్ టీడీపీ, డీసీఎంఎస్ చైర్మన్ జనసేన నుంచి ఎంపిక చేయాల్సి ఉంది. కానీ ఆఖర్లో అన్నీ మారడంతో ఇప్పుడు టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌ను ఎంపిక చేయాల్సి ఉంది.దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు పార్టీ సీనియర్ నేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది.వీరిలో పెచ్చెట్టి చంద్రమౌళి,పెచ్చెట్టి విజయలక్ష్మి ఉన్నట్టు తెలిసింది.చంద్రమౌళి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాగా,విజయలక్ష్మి కోనసీమ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు.డీసీసీబీ చైర్మన్,డీసీఎంఎస్ చైర్మన్ పేర్లను రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ఆ కుర్చీ ఆయనకేనా..

డీసీసీబీ చైర్మన్‌గా పిఠాపురం ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పేరు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తారని ఎన్నికల ముందు ప్రకటించినప్పటి నుంచి మర్రెడ్డి పార్టీలో క్రియా శీలకంగా పనిచేస్తున్నారు. అంతకుముందు అనపర్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఈయన్ను పిఠాపురం తీసుకువచ్చారు.అప్పటి నుంచీ ఇప్పటి వరకు పిఠాపురం జనసేన పిఠాపురం ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.ఈ నేపథ్యంలో ఈయనకు పదవి ఇవ్వాలని నిర్ణయం జరిగినట్టు తెలిసింది. మరోపక్క మర్రెడ్డి తర్వాత పార్టీలో చేరిన తోట సుధీర్‌కు ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబుకు కుడా చైర్మన్ పదవి ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వేముల పాటి అజయ్‌కు టిడ్కో చైర్మన్, హరిప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా తరఫున మర్రెడ్డి పేరు తర్వాత లిస్టులో ఉండడంతో ఇప్పుడు ఈయనకు డీసీసీబీ పదవి కట్ట బెట్టాలని పార్టీ యోచిస్తోంది.కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారు శ్రీనివాస్ పేరు ప్రచారంలోకి వస్తున్నా మర్రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.మర్రెడ్డిని డీసీసీబీ చైర్మన్‌గా పంపి ఎమ్మెల్సీ నాగబాబును పిఠాపురం ఇన్‌చా ర్జిగా నియమిస్తారనే చర్చ జనసేనలో జరుగుతోంది.

రహదారులు.. బాగు..బాగు!



బీటీ రోడ్డుగా చెందుర్తి-తాటిపర్తి రహదారి

పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం

- ఉమ్మడి జిల్లాలో 29 రోడ్ల అభివృద్ధి
- రూ.73.15 కోట్లు విడుదల
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల
- టెండర్లు పిలవాలని ఆదేశం
- 9 నెలలే నిర్మాణ గడువు
- నాబార్డు-ఆర్ఐడీఎఫ్ రుణం
- ప్రభుత్వ వాటా నిధులు విడుదల

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ప్రభుత్వం మారింది..రోడ్లకు మహర్దశ పట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డెక్కితేనే నరకయాతన.. ప్రస్తుతం ఎక్కడికక్కడ రహదారులు వేస్తున్నారు.. దీంతో ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం లభించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస నిర్వహణకు నోచుకోని రోడ్ల అభివృద్ధికి పుష్కలంగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాబార్డు-ఆర్ఐడీఎఫ్ రుణం, ప్రభుత్వ వాటాతో కలిపి ఉమ్మడి జిల్లాలో 29 రహదారులకు రూ.73.15 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో తక్షణం పనులు ప్రారంభించేందుకు వీలుగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ అధీనంలో ఉన్న గ్రామీణ ప్రాంత రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్ల అభివృద్ధితో పాటు గ్రావెల్, మెటల్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు వేసేందుకు ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించారు.

నాబార్డు దారిచూపుతోంది..

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి నాబార్డు ప్రతి ఏటా రుణం మంజూరు చేస్తుంది. దీనికి ప్రభుత్వం 33 శాతం వాటా నిధులను సమకూర్చాల్సి ఉంటుంది.రుణంతో పాటు ప్రభుత్వం నిధులు కలిపి రోడ్ల అభివృద్ధికి కేటాయిస్తుంది. ఈ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో నాబార్డు రుణాన్ని మంజూరు చేసింది. ఆర్థిక సంవత్సరం మొదలైన నెల వ్యవధిలో ఈ నిధులతో చేపట్టే పనులకు ప్రభుత్వం అనుమతులిస్తూ జీవో జారీ చేసింది. తక్షణం టెండర్లు పిలిచి ఆరు నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించింది.వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి నాబార్డు-ఆర్ఐడీఎఫ్ కింద రుణం మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడం, విడుదల చేస్తామని నాబార్డు రుణాన్ని తీసుకుని ఇతర పథకాలకు మళ్లించడం చేసింది.దీంతో ఐదేళ్ల కాలంలో ఒక పనిని పూర్తి చేయలేకపోయారు.

కాకినాడ జిల్లాలో..

జిల్లాలో 14 పీఆర్‌రహదారులకు రూ.28.10 కోట్లు కేటాయించారు.జగ్గంపేట నియోజకవర్గం మామిడాడ-అప్పన్నపాలెం రహదారికి రూ.1.20 కోట్లు, కాకినాడరూరల్‌లో కేఎస్ఎఫ్ రోడ్డు-యండమూరు -సిరిపురం-అడ్డతూము రోడ్డుకు రూ.2 కోట్లు, వేళంగి-సిరిపురం -తాటిపల్లి జంక్షన్ రోడ్డుకు రూ.1.70 కోట్లు, పెద్దాపురం అసెంబ్లీ ఆర్‌బీ కొత్తూరు-వేట్లపాలెం రోడ్డుకు రూ.1.80 కోట్లు, పులిమేరు-విరవ రోడ్డుకు రూ.1.65 కోట్లు, పిఠాపురం అసెంబ్లీ చెందుర్తి-తాటిపర్తి రోడ్డుకు రూ.1.80 కోట్లు, ఏకే మల్లవరం-ఉప్పరగూడెం రోడ్డుకు రూ.4 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కందరాడ వరకు రూ.55 లక్షలు,పిఠాపురం-సామర్లకోట రోడ్డు-గోవిందరాజులపాలెం- మల్లాం రోడ్డుకు రూ.1.40 కోట్లు,వెల్దుర్తి-ధర్మవరం రోడ్డు నుంచి పి.దొంతమూరు-పి.రాయవరం వరకు రూ.2 కోట్లు,నాగులాపల్లి-సీతానగరం-చేబ్రోలు రోడ్డుకు రూ.1.20 కోట్లు,ప్రత్తిపాడు అసెంబ్లీ లింగంపర్తి-కొండతిమ్మాపురం రోడ్డు రూ.3 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ కాకినాడ-కోటిపల్లి రోడ్డు నుంచి శలపాకకు రూ.2.80 కోట్లు, తుని అసెంబ్లీ కృష్ణాపురం నుంచి యల్లయ్యపేటరోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో 13 రహదారుల అభివృద్ధికి రూ.24.62 కోట్లు కేటాయించారు. అనపర్తి నియోజకవర్గం దుప్పలపూడి నుంచి కాపవరం రోడ్డుకు రూ.2 కోట్లు, మర్రిపూడి నుంచి ఆర్‌బీపట్నం రోడ్డుకు రూ.1.20 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలో కరిచర్లగూడెం నుంచి సంజీవపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు, చోడవరం-గుండేపల్లి రోడ్డుకు రూ.1.80 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం-ఆర్.ఎ ర్రంపాలెం రోడ్డుకు రూ.1.50 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో పెనకనపెట్ట-కుమారదేవం రోడ్డుకు రూ.2.70 కోట్లు, నిడదవోలు నియోజకవర్గంలో సింగవరం-నందమూరు రోడ్డుకు రూ.1.47 కోట్లు, కానూరు-నడుపల్లికోట రోడ్డుకు రూ.1.50 కోట్లు, ఎన్‌హెచ్-16-కొత్తపల్లి అగ్రహారం-కాపవరం రోడ్డుకు రూ.1.70 కోట్లు, పైడిపర్రు-సత్యవాడ రోడ్డుకు రూ.2.70 కోట్లు, రాజమహేంద్రవరం రూరల్‌లో జేగురుపాడు బ్రిడ్జి-కడియపుసావరం-కడియం బ్రిడ్జి రోడ్డుకు రూ.2.60 కోట్లు, కాతేరు నుంచి బాతింగ్ ఘాట్ వరకు రూ.60 లక్షలు, రాజానగరం నియోజకవర్గం సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకు రోడ్డుకు రూ.3.25 కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 రహదారులకు రూ.20.43 కోట్లు కేటాయించారు. అమలాపురం అసెంబ్లీ సిరిపల్లి-మునిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు-ఉప్పలగుప్తం-పేరయ్యచెరువు రోడ్డుకు రూ.3 కోట్లు, కొత్తపేట అసెంబ్లీ అమలాపురం-రావులపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మోడేకుర్రు వరకు రూ.1.45 కోట్లు, మడికి-చిలకలపాడుకు రూ.1.14 కోట్లు, మండపేట అసెంబ్లీ ఆర్‌సీపురం-నదురుబాద- పీపీ రోడ్డుకు రూ.3.30 కోట్లు, ముమ్మిడివరం అసెంబ్లీ ఐ.పోలవరం-శేశనకుర్రు రోడ్డుకు రూ.1.95 కోట్లు,ముమ్మిడివరం-కొత్తలంక రోడ్డు నుంచి పచ్చమట్లవారిపాలెం వరకు రూ.1.32 కోట్లు, పి.గన్నవరం అసెంబ్లీ నల్లచెరువు-పెండాల్యచెరువు రోడ్డుకు రూ.65 లక్షలు, అవిడి-మాచవరం టూ ఇసుకపూడి వరకు రూ.1.25 కోట్లు, అమలాపురం బొబ్బర్లంక,గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్ల మధ్య వయా కొర్లపాటివారిపాలెం రోడ్డుకు 1.10 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ ద్రాక్షారామ-ఆదివారపుపేట-వెల్ల రోడ్డుకు రూ.2.72 కోట్లు, రాజోలు అసెంబ్లీ గొల్లపాలెం బ్రిడ్జి నుంచి కాట్రేనిపాడు రోడ్డు వరకు రూ.1.27 కోట్లు, పొన్నమండ-కాట్రేనిపాడు రోడ్డుకు రూ.1.28 కోట్లు నిధులు కేటాయించారు.

8 నుంచి తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



గోకవరం, మే1 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. గోకవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించేందుకు దేవస్థానంపై పలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.కళ్యాణ మహోత్సవాలు జరుగు ఐదు రోజుల పాటు భక్తులకు ఉచిత అన్నదానం కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. కావున భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వీయ ధ్రువీకరణతో భవన నిర్మాణ అనుమతులు

కొవ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : స్వీయ ధ్రువీకరణ పత్రం అందించి ప్రజలు సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చునని కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 ఫిబ్రవరి 4వ తేదీన జీవో ఎం.ఎస్ నంబరు 20 విడుదల చేసిందన్నారు. జీవో నంబరు 20పై మార్గ దర్శకాలను తెలియజేయడానికి మునిసిపల్ పట్టణ ప్రణాళికా విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో 94.68% పింఛన్ల పంపిణీ



మహిళకు పింఛను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లా ఈసారి 8వ స్థానంలో నిలిచింది. గురువారం ఒక్క రోజులో సాయంత్రం 7 గంటల సమయానికి 94.68% పంపిణీ పూర్తయిందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పేర్కొన్నారు.రాజమహేంద్రవరంరూరల్ మండలం పరిధి హుకుంపేటలో చామకూరి నారాయణ స్వామికి (బెడ్ రీడెన్స్) వృద్ధాప్య పింఛను, బెజవాడ సత్యనారాయణకు దివ్యాంగ పింఛను,మానేపల్లి జయకు వితంతు పింఛను కలెక్టర్ ప్రశాంతి అందజేశారు.ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,34,576 లబ్ధిదారులు ఉండగా 2,22,095 మందికి రూ.96,43,05,500 అందజేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం సమయానికే 91 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ, చాగల్లు మండలాలు ఉన్నాయని, చివరి స్థానంలో కొవ్వూరు అర్బన్ ఉందన్నారు. ముందస్తు కసరత్తు, పకడ్బందీ ఏర్పాట్ల వల్ల ప్రతి నెలా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పింఛన్ల పంపిణీలో మంచి ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లా డుతూ భర్త చనిపోతే వారి పింఛను భార్యకు బదిలీ చేస్తూ ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష 60 వేలమందికి అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 13 రకాల పింఛన్లు 60 లక్షల మందికి అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, మత్స్యేటి ప్రసాద్, బొప్ప న నాగేశ్వరరావు, కోరాడ వెంకటేష్, మట్ట శ్రీను, మరుకుర్తి వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకా ధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, కార్యదర్శులు సూరిబాబు, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పని!





చెరువు వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్

ప్రశాంత్ మృతదేహం

గోపాలపురం, మే1 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుకు నీళ్లుతోడుతున్న విద్యుత్ మోటార్ తగిలి ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. విజయనగరం జిల్లా డాగలగూడకు చెందిన బి.ప్రశాంత్ (21) వెంకటాయపాలెం గ్రామ శివారులో సుంకవల్లి భగవాన్‌దాస్‌కు చెందిన వెంకటేశ్వర ఆక్వా ఫామ్స్‌లో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా గురువారం నీరుతోడుతున్న విద్యుత్ మోటారుకు తగిలి కింద పడిపోయాడు. గమనించిన యాజమాన్యం ప్రశాం త్‌ను వెంటనే గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ప్రశాంత్ చనిపోయినట్టు డ్యూటీ డాక్టర్ వివరించినట్టు సూపరింటెండెంట్ చైతన్య తెలిపారు. ఆసుపత్రికి వచ్చే సమయానికి సుమారు 30 నిమిషాలు ముందే చనిపోయినట్టు తెలిపారు. మృతుడు కుటుంబసభ్యులెవరు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు. కుటుంబ సభులు ఫిర్యా దు చేస్తే కేసు నమోదు చేస్తానని ఎస్ఐ తెలిపారు. యువ కుడి మృతిపై అటు విద్యుత్ అధికారులుకానీ, ఇటు పోలీ సులు అధికారులు కానీ సరైన రీతిలో స్పం దించలేదని స్థానికులు చెబుతున్నారు.



వీసీలో అధికారులతో కలెక్టర్ సమీక్ష

4న 'నీట్' నిర్వహణ

రాజమహేంద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) -2025కి విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొ న్నారు.జేసీ చిన్న రాముడుతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని 8 కేంద్రాల్లో 2,760 మంది అభ్యర్థులు నీట్ రాస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల రవాణాకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ నెల 3,4 తేదీల్లో పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్సు షాపులు మూ సివేయాలని ఆదేశించామన్నారు. అన్ని బస్‌స్టేషన్ల నుంచి ఆయా పరీక్షా కేంద్రా లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ ప్రత్యేక బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కా ర్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సి పాల్ జి.విజయలక్ష్మి, అదనపు ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 390 బస్‌లు

- కృష్ణానది ఉత్తర భాగాన పీ11లో పార్కింగ్
- సిద్ధార్థ మెడికల్ కళాశాలలో భోజనాలు
- సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పునఃప్రారంభించడానికి ఈ నెల 2న(శుక్రవా రం) అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న విషయం తెలిసిందే..ఈ సభకు జిల్లా నుంచి బయలుదేరి వెళ్లే వాహనాలకు కృష్ణా నది ఉత్తర భాగాన ఉన్న ప్రదేశంలో పార్కింగ్ స్థలాన్ని(నెం. పి11) కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమె పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తూర్పు, ఉత్త రాంధ్ర జిల్లాల నుంచి వెళుతున్న 390 బస్సు లు రూట్ నెం.3 ద్వారా వెళ్లాలన్నారు. ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన సూచన బోర్డులను అనుసరించాలని చెప్పారు. ప్రతి బస్సులో ఒక పర్యవేక్షణ ఉద్యోగి ఉంటారని, రూట్ మ్యాప్‌పై వారు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు.ఎలాంటి సందేహం ఉన్నా కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలన్నారు. ప్రజలు ఇబ్బం ది పడకుండా అవగాహన కల్పించడం, బృందాలుగా సభకు వెళ్లడం, తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరుకోవడంలో టీం లీడర్లు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. గన్నవరం సమీపంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఇటువైపు నుంచి వెళ్లే వారికి భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నాయక్, శ్రీనివాస్ పర్యవేక్షణ చేస్తారన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



తుని రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): కులగణనతో సామాజిక న్యాయం సాధ్యమని కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు టీడీపీ బీసీ సీనియర్ నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కులగణనతో వెనుకబడిన వర్గాలు రాజ్యాంగంలో నిర్దేశించిన సామాజిక న్యాయానికి దగ్గరవుతాయనే నమ్మకం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. జనాభా గణనకు అనుబంధంగా కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా ఏళ్లుగా జనాభా గణన, కులగణన జరగలేదని ఇప్పుడు కేంద్రప్రభుత్వం గణన చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కులగణన సుదీర్ఘకాలంగా జరగకపోవడంవల్ల వెనుకబడిన వర్గాలు చాలా అవకాశాలు కోల్పోయాయని కేంద్ర క్యాబినేట్ నిర్ణయంతో ఆయా వర్గాల్లో నూతనోత్తేజం కలుగుతోందని యనమల అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన గడువును నిర్ణయించి జనాభా గణన, కుల గణన పూర్తిచేయాలని యనమల కోరారు.

ఈ బస్సులు వస్తున్నాయ్!

● కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు వంద బస్సులు మంజూరు
● రెండో విడతలో అమలాపురం, తుని డిపోలకు కేటాయింపు
● డిపోల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

త్వరలో జిల్లా రోడ్లపై విద్యుత్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. కాలుష్యానికి తావులేకుండా, కుదుపులకు అవకాశమివ్వని.. అధునాతన బస్సులు రయ్.. రయ్‌మని తిరగనున్నాయి. విద్యుత్ బస్సులతో కాలుష్యం తగ్గడమే కాదు.. చార్జీల బాదుడూ తప్పనుంది. రానున్న కొన్నినెలల్లోనే డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

త్వరలో టెండర్లు ఖరారు

పీఎం ఈ-బస్ సేవా పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏపీలో 1050 బస్సులను ప్రవేశపెట్టనుంది. కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్(సీఈఎస్ఎల్)తో కలిసి ఈ బస్సులను ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే టెండర్లు కూడా పిలిచింది. బిడ్లు దాఖలై.. త్వరలో టెండర్లు ఖరారు కానున్నాయి. బస్సు కంపెనీలను ఎంపిక చేసి వాటికి కిలోమీటరుకు ఎంత ధర చొప్పున చెల్లించాలో నిర్ణయిస్తారు. కేంద్రం ఒక్కో బస్సుకు రూ.35లక్షల మేర ఆయా కంపెనీలకు నేరుగా రాయితీ ఇవ్వనుంది. అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను ఆర్టీసీ నడపనుంది.

పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ బస్సులు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో 11 నగరాలకు 750 ఎలక్ట్రికల్ బస్సులను మంజూరు చేసింది. తిరుమలకు తిప్పేందుకు అదనంగా 350 బస్సులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రికి లేఖ రాయగా.. కేంద్రం అంగీకారం తెలిపింది. దీంతో కేంద్రం అందజేసిన బస్సుల సంఖ్య 1050కు చేరింది. ఇందులో విశాఖ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు డిపోలకు వంద చొప్పున బస్సులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడ, రాజమహేంద్రవరం, కర్నూలు, కడప, అనంతపురం, తిరుపతి, మంగళగిరి డిపోలకు 50 బస్సులు చొప్పున అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు ఈ బస్సులు రానున్నాయి. వీటి పనితీరు ఆధారంగా రెండో విడతలో అమలాపురం, తుని డిపోలకు ఈ బస్సులను అందజేయనున్నారు.

చౌకగా.. సౌకర్యవంతంగా..

ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న బస్సులతో పోలిస్తే విద్యుత్ బస్సుల్లో ప్రయాణం చాలా చౌకని అంటున్నారు. అంతేకాదు శబ్ద కాలుష్యం లేకుండా ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. సాధారణ బస్సులు కిలోమీటరుకు సగటున రూ.7.65 పైసల వ్యయమవుతుండగా.. ఎలక్ట్రికల్ బస్సుల్లో రూ.1లోపే ఉంటుంది. విద్యుత్ బస్సులు ఒకసారి చార్జింగ్‌తో 150 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. రాను, పోను వంద కిలోమీటర్లు దూరంలో ఉండేలా నగరాలు, రూరల్ ప్రాంతాలకు బస్సులను తిప్పనున్నారు. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల కింద అనేక ప్రాంతాలకు నడపనున్నారు.

కాకినాడ బస్సు డిపో పరిశీలన

విద్యుత్ బస్సుల చార్జింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను డిపోల్లోనే చేస్తున్నారు. కాకినాడ డిపోలో ఆ పనులు జరుగుతున్నాయి. ఇటీవల కొందరు ఉన్నతాధికారులు విజయవాడ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన విషయాలను పరిశీలించారు. బస్సులను ఎక్కడ నిలుపుదల చేయాలి? వాటికి అవసరమైన చార్జింగ్ పాయింట్లకు అవసరమైన విద్యుత్‌లైన్ వంటి విషయాలపై కాకినాడ డిపో అధికారులతో చర్చించారు. విద్యుత్ బస్సుల రాకతో ఆర్టీసీపై భారం తగ్గనుందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. డీజిల్ ధరలు పెరిగినప్పుడు ప్రయాణికులు పడే భారం ఈ విద్యుత్ బస్సుల రాకతో తప్పనుందని చెబుతున్నారు.

జ్ఞాన్‌పోస్టును వినియోగించుకోవాలి

● రూ.100తో 5కిలోల వరకూ బట్వాడా
● పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 1 నుంచి భారత తపాలాశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన 'జ్ఞాన్ పోస్ట్'ని వినియోగించుకోవాలని రాజమండ్రి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ కె.శేషారావు కోరారు. ఈసేవ ద్వారా పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ని పార్సిల్, బుక్ పోస్టుకంటే తక్కువ ఖర్చుతో పోస్టు చేయవచ్చన్నారు. గరిష్ఠంగా 5కిలోల వరకూ పంపించవచ్చని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విద్యాబోర్డులు, ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యార్థుల కరెస్పాండెన్స్, రెగ్యులర్ కోర్సులు, సిలబస్‌లో సూచించిన పుస్తకాలై ఉండాలన్నారు. పాఠ్య పుస్తకాలు, సామాజిక, సాంస్కృతిక, చట్టాలకు లోబడిన మతపరమైన సాహిత్యం వంటివి కూడా జ్ఞాన్‌పోస్ట్ ద్వారా పంపించవచ్చన్నారు. 300 గ్రాముల బరువు వరకూ కేవలం రూ.20,500గ్రా-రూ.25, కిలో-రూ.35, 2కిలోలు రూ.50, 3కిలోలు రూ.65, 4కిలోలు రూ.80, 5కిలోల వరకూ రూ.100తో జ్ఞాన్ పోస్టులో పంపించవచ్చని పేర్కొన్నారు. స్పీడు పోస్టు మాదిరిగా ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టం ద్వారా లైవ్‌స్టేటస్‌ని తెలుసుకునే సదుపాయం కూడా కల్పించారని ఆయన చెప్పారు. నియమ నిబంధనల కోసం పోస్టాఫీసులో సంప్రదించాలన్నారు.

రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భావం

కాకినాడసిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా కొత్తగా రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భవించింది. కాకినాడజిల్లా పరిషత్ అతిథి గృహంలో గురువారం కార్మిక నాయకుడు, ట్రేడ్ యూనియన్ వ్యవస్థాపకుడు కోలా ప్రసాదవర్మ ఆర్ఎన్‌టీయూసీ జెండా లోగోను ఆవిష్కరించారు. రాష్ట్ర, జిల్లా, నగర, రూరల్ కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వల్లూరి రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా లంకే పకీర్‌రాజు, ఉమ్మడి సురేంద్రనాథ్, కార్యదర్శులుగా కదిరి జగన్నాథం, కుక్కల పోతురాజు యాదవ్, కోశాధికారిగా నరుకుర్తి రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కె.కన్నబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా తురాల శ్రీనివాస్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మోర్తా శోభన్‌బాబు, కాకినాడ సిటీ, రూరల్ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి చిన్నలను నియమించారు.

మురమళ్లకు బ్రహ్మోత్సవ శోభ

● ఘనంగా వీరేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు



స్వామి, అమ్మవారు ఊరేగింపులో ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్చకుడు, శైవాగమ పండితుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో పూజలకు అంకురార్పణ జరిగింది. గణపతి పూజ అనంతరం స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా చేశారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి భద్రపీఠంపై ఆశీనులై గ్రామ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఎదురు సన్నాహం జరిపి వధూవరులను ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్సవ విగ్రహాల దాత జంపన రామకృష్ణంరాజు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. ఆలయ సహాయ కమిషనరు మాచిరాజులక్ష్మీనారాయణ, పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

● రాజమహేంద్రవరం చేరుకున్న పశ్చిమబెంగాల్ యువకుడు ప్రశాంజిత్ దాస్



రాజమహేంద్రవరంలో సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, రక్తదానం, ఆరోగ్యం తదితర నినాదాలతో పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ క్రమంలో గురువారం రాజమహేంద్రవరం చేరుకున్నాడు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సమీపంలో సైకిల్ యాత్ర చేస్తూ కనిపించాడు. ఈసందర్భంగా సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్ మాట్లాడారు. తనది పశ్చిమబెంగాల్ రాష్ట్రం మూసిరాబాద్ అని చెప్పారు. జనవరి 2025న పశ్చిమబెంగాల్‌లో తన సైకిల్‌యాత్ర ప్రారంభించానన్నారు. బీటెక్ పూర్తిచేసిన తాను పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రజలను, విద్యార్థులను చైతన్యవంతం చేయడానికి ఈ యాత్ర ప్రారంభించానని చెప్పారు. రోజుకు 60 కిలోమీటర్లు సైకిల్‌తొక్కుతూ పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిస్సా మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 5,200 కిలోమీటర్ల ప్రయాణం చేశానన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, రక్తదానం చేయండి తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రపంచంలో 195దేశాలను చుట్టిరావాలని లక్ష్యంతో ఉన్నానని చెప్పారు. మొత్తం 3లక్షల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర టార్గెట్‌గా పెట్టుకుని ముందుకు సాగుతున్నాని చెప్పారు. ఎక్కడికక్కడ రాత్రి బస చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, ఇన్‌స్టా ఫాలోవర్ల సహకారంతో సైకిల్ యాత్ర కొనసాగిస్తున్నానన్నారు. బ్యూటిఫుల్ ఆంధ్రప్రదేశ్ బాగుందని కితాబు ఇచ్చాడు సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

● 26 జట్లు, 208 మంది క్రీడాకారుల రాక



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో 12వ రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు జరుగుతుయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 పురుషులు, మహిళల జట్ల సభ్యులు 208 మంది వస్తున్నారని నిర్వాహకుడు వెంకటరెడ్డి తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, సదుపాయాలను సమకూరుస్తున్నామన్నారు. కోర్టు, వేదిక, మ్యాచ్ రిఫరీలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, కోచ్ సాయిప్రసాద్, సోదె ముసలయ్య, శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కులాలు, మతాలపేరుతో విభజించి మోదీ పాలన

● ప్రధానికి ఎన్నికలపై ఉన్న ప్రేమ దేశభద్రతపై లేదు
● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శలు
● ఎర్రజెండాకు కాలం చెల్లలేదు, ఇంకా ఎరుపెక్కుతూనే ఉందని వ్యాఖ్యలు



సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి నారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి రాష్ట్రాల ఎన్నికలపై ఉన్న ప్రేమ దేశభద్రతపై లేదని, కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేయాలనుకోవడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కులాలు మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలన చేస్తున్నారని ఆరోపించారు. గురువారం సీపీఐ జట్ల లేబర్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన మేడే వేడుకల్లో నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంవద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మీడియాతోను, అనంతరం ఆవరోడ్డులో జరిగిన బహిరంగ సభలోనూ నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ 2వ తేదీన అమరావతి వస్తున్న సందర్భంగా ప్రధాని సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మీసం మెలేసి అమరావతి పునర్నిర్మాణం జరిగేలా మాట్లాడాలన్నారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాము నమ్ముతున్నామని, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక హోదా కోసం ప్రధానిని ప్రశ్నించాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అమరావతిని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మోదీ పక్షంగానే మారిపోయాయన్నారు. కార్మిక చట్టాల రద్దుతో కార్మికుల అన్ని హక్కులు కాలరాస్తున్నారని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైతే బానిస బతుకులు సాగిస్తున్నారన్నారు. సెప్టెంబరులో సీపీఐ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో జరుగుతాయని, ఇండియా కూటమిని బలోపేతం చేసే దిశగా ఈ సభల్లో చర్చిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళపై బీజేపీ వాళ్ల కోడిగుడ్లుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎర్రజెండాకు కాలం చెల్లలేదని, ఇంకా ఎరుపెక్కుతూనే ఉందని, దోపిడీ ఉన్నంతవరకూ ఎర్రజెండా బతికే ఉంటుందని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన భూములను అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతి కార్మికుడు పోరాడాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినం, ఉద్యోగ భద్రత కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలన్నారు. జట్లులేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్ప రమణ, సునీల్, కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. పలుచోట్ల పతాకాలను ఆవిష్కరించారు.

తీరంలో మత్స్యకారుల బోటు ర్యాలీ



సముద్రంలో బోటు ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

తొండంగి, మే 1(ఆంధ్రజ్యోతి): వేట నిషేధ భృతిని రూ.20వేలు ఇచ్చి మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ మండల మత్స్యకారులు సముద్రంలో బోట్లతో ర్యాలీ నిర్వహించారు. గురువారం పెరుమాళ్ళపురం వద్ద బోట్లలో తెలుగుదేశం జెండాలు చేతపట్టి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ బోట్లతో ర్యాలీ నిర్వహించారు. మండల మత్స్యకారులకు ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కృషితో రూ.5కోట్ల52లక్షల పరిహారం అందిందని గతంలో ఎప్పుడూ ఇంత మొత్తం విడుదల కాలేదని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మత్స్యకార నేతలు కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, మహంకాళి, చొక్కా కాశీశ్వర్రావు, గంటా లక్ష్మణ్, రాంబాబు, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

8 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

కలెక్టరేట్ (కాకినాడ), మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నోడల్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. పదోన్నతి పొందిన వారిలో పీబీఎస్‌వీ ప్రసాద్‌రావు, ఎస్.కె పద్మవేణి, జి.ఫణీంద్ర రఘుపతిరావు, ఆర్‌టీటీ విజే సీతారామయ్య, జే.ధర్మేంద్ర, ఎం. సత్యవెంకటేష్, ఎం.దొరబాబు, బి.రేవతిలు ఉన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన వీరిని నియమించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి జట్టు కార్మికుడి మృతి



కొప్పిశెట్టి శ్రీనివాసరావు

ముమ్మిడివరం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున ముమ్మిడివరంలో ఓ జట్టు కార్మికుడు ప్రమాదవశాత్తూ ట్రాక్టరు పైనుంచి జారి కిందపడి మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ నక్కావారిపేట కాల్వగట్టు వద్ద జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరకకు చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు (49) జట్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ముమ్మిడివరం నుంచి ట్రాక్టరుపై సిమెంటు, ఐరన్ తరలిస్తుండగా నక్కావారిపేట కాల్వగట్టు సమీపంలో ట్రాక్టరు పైనుంచి జారి తీవ్రంగా గాయపడ్డాడు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య పరమేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ టి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాసరావు మృతితో ఆ కుటుంబం ఆధారాన్ని కోల్పోయింది.

వారు ప్రమాదకర ఆర్థిక ఉగ్రవాదులు

● మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్ (కాకినాడ), మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రమాదకర ఆర్థిక ఉగ్రవాదులని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విమర్శించారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి కూటమి ప్రభుత్వంపైన, తనపై చేస్తున్న ఆరోపణలపై స్పందించి గురువారం కాకినాడలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై చేస్తున్న ఆరోపణలకు మాజీ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పెదపూడి మండలం దోమాడ గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన ఐదు కుటుంబాల వారికి వైసీపీ నేతల నుంచి ముప్పు ఉందన్నారు. గతంలో వైసీపీ హయాంలో అనపర్తి నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు, దౌర్జన్యాలు జరిగాయని అవన్నీ అప్పటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి హయాంలోనేనని చెప్పుకొచ్చారు. 2021లో దోమాడలో నాలుగున్నర ఎకరాల ను గోవిందరాజులు, రాహుల్‌రెడ్డి లే అవుట్ చేశారన్నారు. దీనికి అనుమతులు ఇచ్చి 45సెంట్లు సామాజిక స్థలంగాను, నాలుగు లక్షల ఫీజు రుడాకు చెల్లించారన్నారు. నిరాశ్రయులైన ఐదు కుటుంబాల వారికి అప్పటి ఎమ్మెల్యే పట్టాలిచ్చారని చెప్పారు. గత నాలుగు నెలలుగా తనకేమీ తెలియకుండా ఆ బాధితులతో రహస్య సమావేశాలు నిర్వహించి వారిని ఆయన స్వార్థానికి వినియోగించుకున్నారన్నారు. లేఅవుట్ యజమానులకు, సూర్యనారాయణరెడ్డికి మధ్య సంబంధాలు బెడిసి కొట్టడంతో ఆ ఇళ్లను కూల్చేందుకు ఆయనే కారణమయ్యారన్నారు. ఆ లేఅవుట్లలో ఎవరూ స్థలం కొనవద్దని ప్రచారంచేసిన సంగతిని రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న సూర్యనారాయణరెడ్డి హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయని, కర్రి అరుణకుమారి, కోటిపల్లి కామాక్షి, పంపన ఆనందరావు ఆత్మహత్యలకు దమ్ము శివయ్య ఆత్మహత్యాయత్నానికి ఆయన అనుచరులే కారణమన్నారు. వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ దోమాడ ఘటనపై తన గురించి అనవసర వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఆయన రాజానగరంలో రూ.5కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, కలెక్టర్‌ను కలిసి విచారణ చేయాలని ఫిర్యాదు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మీడియా ప్రతినిధి నాని, నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దత్తుడు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిందితుడి ఇంటిపై దాడి

● ఎస్.అచ్చుతాపురంలో ఉద్రిక్తత



విలపిస్తున్న మృతుడి తల్లిదండ్రులు



కుక్కల నాని (ఫైల్)

సర్పవరం జంక్షన్, మే 1 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్యకు కారణమైన నిందితుడి ఇంటిపై మృతుడి కుటుంబీకులు దాడికి పాల్పడి ధ్వంసం చేసిన సంఘటన గురువారం సాయంత్రం ఎస్.అచ్చుతాపురంలో చోటుచేసుకుంది. కాకినాడ కార్పొరేషన్ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురం అంబేద్కర్ వీధిలో నివాసముంటున్న కుక్కల నాని, అదే ప్రాంతానికి చెందిన పెంటి కృష్ణప్రసాద్ (జాజి) కుటుంబాల మధ్య ఇంటి సరిహద్దు విషయంలో విభేదాలు ఉన్నాయి. గతనెల 25వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కుక్కల నానిపై కృష్ణప్రసాద్ (జాజి) చాకుతో దేహంపై పలు మార్లు విచక్షణారహితంగా పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో కిందపడి ఉన్న నానిని గమనించిన కుటుంబీకులు అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించడంతో బంధువులు స్వస్థలానికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు తీవ్ర ఆగ్రహానికిగురై నిందితుడి ఇంటిపై రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను వారించారు. అయినా వారు వినకుండా మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతుడు కుటుంబానికి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు జరగనివ్వమన్నారు. పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు. నిందితుడు కృష్ణప్రసాద్‌ని గతనెల 26న అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చైతన్యకృష్ణ తెలిపారు.

ఆరోగ్యానికి బ్లాక్ రైస్ మంచిది

● ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్‌చెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): బ్లాక్‌రైస్‌లో ఐరన్, జింక్ వంటి పోషకాలు ఉంటాయని, ఆరోగ్యానికి మంచిదని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. పశ్చిమగోదావరిజిల్లా మార్టేరులో గురువారం గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరిగిందన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల్లో 2025-26లో అమలు పరచబోయే విస్తరణ కార్యాచరణను రెండురోజులపాటు శాస్త్రవేత్తలు, రైతులు ఇందులో చర్చిస్తారన్నారు. బ్లాక్‌రైస్ (బీపీటీ 2841) బియ్యంను రంగంపేట అభ్యుదయ రైతు పోతుల పద్మారావు కలెక్టర్ నాగరాణి, ఇతర అతిథులకు అందజేశారన్నారు. తాను, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఇచ్చిన ఈవిత్తనంను ఆయన వృద్ధి చేశారని తెలిపారు. వచ్చే సార్వాకు 500 కిలోల విత్తనం లభ్యత తన వద్ద ఉందని రైతు పద్మారావు తెలిపారని నరసింహారావు చెప్పారు.

ముగ్గురు దొంగల అరెస్టు

● రూ.12.50లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

మామిడికుదురు, మే 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలోని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.12.5లక్షల విలువచేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. గురువారం నగరం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సీఐతోపాటు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ చోరీలకు సంబంధించిన వివరాలు తెలిపారు. పెదపళ్లకు చెందిన కుడుపూడి నాగరాజు, ఆలమూరు మండలం కండ్రిగపేటకు చెందిన వాసంశెట్టి వీరబాబు, గువ్వల చంద్రశేఖర్, మరో నిందితుడు గుత్తుల సుభాష్ ముఠాగా ఏర్పడి పలు దొంగతనాలకు పాల్పడ్డారని, వీరిలో ముగ్గురిని అరెస్టుచేయగా గుత్తుల సుభాష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరిపై నగరం, తాడేపల్లిగూడెం, తడికలపూడి, ద్వారకాతిరుమల, దేవరపల్లి, పెరవలి, దెందులూరు, జంగారెడ్డిగూడెం పోలీసుస్టేషన్లలో పలు దొంగతనాల కేసులు నమోదయ్యాయని, వీరు చైన్ స్నాచింగ్‌లతో పాటు మోటారు సైకిళ్ల దొంగతనాలు చేస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో బంగారం అమ్మేందుకు వెళుతుండగా వీరిపై అనుమానం వచ్చిన నగరం ఎస్ఐ చైతన్యకుమార్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వీరి నేరాలు బయటపడ్డాయని సీఐ తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐలు భీమరాజు, గజేంద్ర, ఎస్ఐలు చైతన్యకుమార్, పరదేశీలు, కానిస్టేబుళ్లు కృష్ణసాయి, శ్రీను, దుర్గాప్రసాద్, అర్జునరావు, సుభాకర్‌లను అంబేడ్కర్ కోనసీమజిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భీమరాజు



దుళ్ల ఎర్రకాలనీలో మేడే కార్యక్రమం నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు



రాజమహేంద్రవరంలో కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మికులకు కూటమి అండ

- పేపరుమిల్లులో టీఎన్‌టీయూసీ జెండా ఎగురవేస్తాం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- పలుచోట్ల అరుణ పతాకం ఆవిష్కరణ



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు మదర్ థెరిస్సా పార్కు వద్ద టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కార్మికులదీ కీలక పాత్ర అని, ప్రభుత్వం వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రెండేళ్ల క్రితం వైసీపీ వాళ్లు తనను, తన తండ్రిని అన్యాయంగా మే డే నాడే అరెస్టు చేసి జైలుకు పంపారని, మేడే స్ఫూర్తితోనే పోరాడి బయటకు వచ్చామన్నారు. గ్యాస్ ఏజెన్సీ కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయించామని, పేపరుమిల్లు పరంపర కార్మికులకు న్యాయం చేశామని, మిల్లులో టీఎన్‌టీయూసీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో వర్రే శ్రీనివాస్, బాక్స్ ప్రసాద్, బట్లంకి ప్రకాష్, టీఎన్‌టీయూసీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక సోమాలమ్మ గుడి ప్రాంతంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, రెడ్డిరాజు ఆధ్వర్యంలో రెడ్డి వీరాస్వామి స్థూపం వద్ద టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ నివాళులర్పించారు. స్థానిక టింబర్ యార్డులో సామిల్లు వర్కర్స్ యూనియన్ ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, కె.జోజి ఆవిష్కరించారు. ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, పీవోడబ్ల్యు శ్రీవిముక్తి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సంగీత, పాల్గొన్నారు. ఆర్యాపురం కర్రల అడితిలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, రైల్వే మెమో కార్ షెడ్ వద్ద, ఐదు బళ్ల మార్కెట్ వద్ద కార్మిక దినోత్సవం జరిగింది. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ,రైల్వే వర్కర్స్ యూనియ్ అధ్యక్షుడు ఎస్.రాజేష్, వా ఎంసెట్టి భద్రం, గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ నాయకుడు చనపతి శివకుమార్ ఎర్రజెండాలను ఆవిష్కరించారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ దేశంలోని కార్మికవర్గానికి బీజేపీతో కలసి రాష్ట్రంలోని వైసీపీ, తెలుగుదేశం పార్టీలు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. 8 గంటల పనివిధానాన్ని కాపాడుకోవడమే మేడే కర్తవ్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ అన్నారు. పేపర్‌మిల్లు, హార్లిక్స్‌ఫ్యాక్టరీ, కోకో కోలా, ఓఎన్‌జీసీ, సర్వరాయ షుగర్స్, జీవీకే, మున్సిపల్ వర్కర్స్ ప్రైవేట్ హాస్పటల్స్ తదితర సెంటర్లలో సీఐటీయూ పతాకాలను నేతలు ఆవిష్కరించారు. నాయకులు ఎస్ఎస్ మూర్తి, కేఎస్‌వీ రామచంద్రరావు, పూర్ణిమరాజు, కె.రామకృష్ణ, తులసి, బేబీ రాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవీచౌక్ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, అల్లాటి రాజు, గుణ్ణం శ్యాం, విన్నవాసు పాల్గొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, జిల్లా సహాధ్యక్షురాలు విజయగౌరీ మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిలర్ రూపస్‌రావు, జిల్లా కార్యదర్శి శ్రీమణి, రమేష్‌బాబు, ఎం.శ్రీనివాస్, సీహెచ్ దయానిధి, రవిబాబు పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్లను తిప్పికొడదాం, ప్రభుత్వరంగ సంస్థలను బడా, కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ప్రతిఘటిద్దామని అన్నారు. ముందుగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు సూరిబాబు జెండాను ఆవిష్కరించారు. నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, పీడీఎస్‌యూ భాను, దినేష్, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కోటగుమ్మం వద్ద ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పారా సంస్థతో సంయుక్తంగా డీలక్స్ నుంచి కోటగుమ్మం వరకు కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన సమావేశంలో జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ కార్మికుల భద్రతకు, సంక్షేమానికి ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. పారా ప్రతినిధులు ఫాదర్ సింహరాయులు, ఏపీటీఎస్ మైగ్రెంట్ వర్కర్స్ ఫోరమ్ రాష్ట్ర ఇన్‌చార్జి ఎండీ అమీర్ పాషా, దినకర్ పొన్నాల, సీజీ కిషోర్, బి.దుర్గ తదితరులు పాల్గొన్నారు. స్థానిక తాడితోటలోని సంహిత కన్వెన్షన్ హాలులో జరిగిన మేడే వేడుకలకు వైసీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్మిక పోరాట యోధుడు జక్కంపూడి రామమోహనరావు విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, గెడ్డం రమణ, నందెపు శ్రీను, ఇసుకపల్లి శ్రీను, కేఎల్ఎన్ రెడ్డి, సాయిబాబా, అడపా అనిల్ పాల్గొన్నారు.

కడియం: స్థానిక పేపరుమిల్లు ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పాకా మంగయ్య జెండా ఎగురవేసారు. కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు డీపీ నాయుడు, పల్లి ప్రసాద్, ఎంవీ రామరాజు, వై రవికుమార్ పాల్గొన్నారు. వేమగిరిలో ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తూరి బాలనాగేశ్వరరావు, మద్రి సుబ్రహ్మణ్యం, వాశంశెట్టి నాగేశ్వరరావు, బొర్రా సుబ్బారావు పాల్గొన్నారు. దుళ్ల ఎర్రకాలనీలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు పితాని ధనలక్ష్మి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అమెరికా చికాగో నగరంలో ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు పోరాటం చేస్తుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు కార్మికులు అమరులయ్యారని, వారి స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, అలజంగి గడ్డియ్య, షేక్ హసీనాబేగం, ఏ ఈశ్వరమ్మ, గుమ్మడి చంద్ర పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులను వివరించారు. అసంఘటిత కార్మికుల కోసం నల్సా న్యాయ సేవల పథకంపై అవగాహన కల్పించారు. కార్మికులు న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు ఎస్కే జబీనా, టీఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్.. డ్రైవర్లకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే) సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న కొందరు డ్రైవర్లకు పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి రూ.10 లక్షల పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించారు. గురువారం మునిసిపల్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మే డే వేడుకల్లో తొలుత ఏపీ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ)రాష్ట్రాధ్యక్షుడు కేవీ కృష్ణారెడ్డి, జిల్లా ఐఎన్‌టీ యూసీ అధ్యక్షుడు జేటి రామారావులతో కలిసి జెండాను ఎగురవేసి అటుపై టీకే సొంత ఖర్చులతో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ చేయించారు. అసంఘటిత కార్మికులు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను ప్రభుత్వాలు ఇంకా బలోపేతం చేసి కార్మికులకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్ శ్రీనివాస్, తడాల కొండరాజు, ఎం.భద్రందొర, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
ఉచిత వేసవి క్రీడాశిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్ విభాగాల్లో శిక్షణ ఇస్తామని స్పోర్ట్స్ విభాగాధిపతి పీఏ కిశోర్‌బాబు తెలిపారు. విద్యార్థులంతా ఎలాంటి వయో పరిమితి లేకుండా శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

బహమాస్ సదస్సులో పాల్గొనడం అదృష్టం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): బహమాస్ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందని జాతీయ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విభిన్న రాష్ట్రాలు, వివిధ రాజకీయపార్టీలకు చెందిన సభ్యులతో కూడిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సాధికారత అంశాలపై ప్రయోజనాత్మక చర్చల్లో పాల్గొనడం ఓ గొప్ప అనుభవంగా నిలిచిందని తెలిపారు. కాగా, పురందేశ్వరి మే 5న బహమాస్ నుంచి తిరిగి ప్రయాణం కానున్నారు.

ప్రధాని మోదీ విచ్చేస్తుండడం హర్షణీయం... ప్రజారాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేందుకు మే 2న ప్రధాని మోదీ విచ్చేస్తుండడం పట్ల ఎంపీ పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

సింహాచలం ఘటనపై దిగ్భ్రాంతి... సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవంలో గోడకూలి భక్తులు మరణించిన ఘటనపై ఎంపీ పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పల్లాలమ్మ ఆలయాభివృద్ధికి
ఎమ్మెల్యే గోరంట్ల రూ.లక్ష విరాళం



కడియం, మే 1(ఆంధ్రజ్యోతి): కడియపులంక జాతీయ రహదారి సమీపంలో ఉన్న, ఇటీవల పునఃనిర్మించిన పల్లాలమ్మ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని గురువారం రూ.1 లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా పోరాడేందుకే
గ్రేటర్ క్రిస్టియన్ అసోసియేషన్

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత క్రైస్తవ సంఘాలుగా ఉన్న కొన్ని సంఘాలు ఏదొక రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉన్నాయని, నాన్ పొలిటికల్ సంఘంగా గ్రేటర్ రాజమండ్రి క్రిస్టియన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు సంఘం కన్వీనర్ పాస్టర్ గుళ్ల మార్టిన్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ పగడాల మరణించిన ప్రదేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్ ఈనెల 24న నిర్వహిస్తున్న సభకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. మరణించిన ప్రదేశంలో వేయి గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తే ప్రవీణ్ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

మాధవరాయుడుపాలెం కార్యదర్శి
మోహనరావుకు వీడ్కోలు సభ



కడియం, మే 1 (ఆంధ్రజ్యోతి): మాధవరాయుడుపాలెం గ్రేడ్..1 కార్యదర్శి తురగా కృష్ణ మోహనరావు పదవీ విరమణ పొందిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన వీడ్కోలు, అభినందన సత్కారం జరిగింది. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల స్టాలిన్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కుతుకులూరులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి అందజేశారు. సర్పంచ్ గొల్లు హేమతులసి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ముందుగా పింఛన్‌దారులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమతులసి, కూటమి నాయకులు వెంకట సుబ్బారెడ్డి, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

అనపర్తి/రంగంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నా యి. అనపర్తి నియోజకవర్గంలో ధ్వంసమైన వేమగిరి-కాకినాడ కెనాల్ రోడ్డు మరమ్మతు పనులు, రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తిచేశారు. ఇప్పుడు మర్రిపూడి-రాయభూపాల పట్నం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 20 లక్షలు, దుప్పలపూడి - కాపవరం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు పంచాయితీరాజ్ శాఖ నుంచి నాబార్డ్ సహకారంతో నిధులు మంజూరయ్యాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



రంగంపేట శాఖా గ్రంథాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో విజ్ఞానం మెండు

రంగంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం చైతన్యానికి నాంది అని రంగంపేట గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం రంగంపేట శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 4వ రోజు విద్యార్థులతో యోగాసనాలు వేయించి ధ్యానం చేయించారు. దీనివల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. తరువాత అందని ద్రాక్ష నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో ఉండవిల్లి మాణిక్యం, పాఠకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే వాస్తవాలు పలకాలి'

అనపర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి) : పెదపూడి మండలం దోమాడలో ఆక్రమణల తొలగింపును మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆయన వాస్తవాలు పలకాలని బీసీ నాయకుడు, పెదపూడి టీడీపీ మండల అధ్యక్షుడు జుత్తుగ కృష్ణ అన్నారు. గురువారం అనపర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు లేఅవుట్‌కు అనుమతులు ఇప్పించడమే కాకుండా అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించేందుకు వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆక్రమణల తొలగింపును రాజకీయం కోసం వాడుకొనేందుకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై నిందలు మోపడం పద్ధతి కాదన్నారు. మరో నాయకుడు మామిడిశెట్టి శ్రీను మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంతో మంది అమాయకుల ప్రాణాలు పోయాయని అవన్నీ వైసీపీ చేసిన హత్యలేనని అన్నారు. మరో నాయకుడు పేరిశెట్టి లాలయ్య మాట్లాడుతూ రాజకీయాలు చేసే సత్తా లేకే మాజీ ఎమ్మెల్యే అవాస్తవాలను ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. పులగుర్తలో ఆనందరావు, ఆర్ఎస్ పేటలో కామాక్షమ్మ మరణాలను ప్రజలు మరువరని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ బీసీ, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మేడే వేడుకల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తిలో టీఎన్‌టీయుసీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మేడే సందర్భంగా ఐఎల్‌టీడీ వద్ద ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు కార్మికులతోపాటు టీఎన్‌టీయూసీ నాయకులు, ఐటీసీ కార్మికులు పాల్గొన్నారు.



రాజానగరం మండలం సూర్యారావుపేటలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాలు

రాజానగరం, (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకోవాలని కార్మిక, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికుల దినోత్సవాన్ని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో రాజానగరంలో నిర్వహించారు. సాయిబాబా గుడి సమీపంలో రైతుకూలీ సంఘం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు సత్తిబాబు, సూర్యారావుపేటలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి దుర్గా ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయిబాబా గుడి నుంచి సూర్యారావుపేట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఏవీ రమణ, ఏఐకెఎంఎస్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి పి.వెంకటనాయుడు, కార్మికుల సమాఖ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరుకుర్తి ఏసు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కార్యదర్శి ఆర్.తిరుపతిరావు, జిల్లా సహాయ కార్యదర్శి పి.సోమన్న, జిల్లా కమిటీ నాయకులు పాపన్న, రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు, రామచంద్రపురం డివిజన్ నాయకులు ఎం.రాజు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు గంటా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవనగర్ కాలనీలో గురువారం మేడేను నిర్వహించారు. ముందుగా సంఘ నాయకులు దాసరి శ్రీను జెండాను ఆవిష్కరించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఈ.వెంకటనాయుడు ఆధ్వర్యంలో మేడేను జరిపారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జగన్నాథం, నాగన్న, దాసరి వెంకన్న, దాసరి శ్రీను, అబ్రహం, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు, (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు దళితవాడలో ఏఐఎఫ్‌టీయూ, ఏపీఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. నాయకులు గొడ్ల యేసు, బొచ్చ యేసులు ఏఐఎస్టీయు జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాజబాబు మాట్లాడారు. నాయకులు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, రెడ్డి దుర్గాదేవి, డి.నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఊలపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని పూర్వపు జిల్లా కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ ఎగురవేశారు. నేతలు సతీష్‌రెడ్డి, గోవిందరావు, రామచంద్రారెడ్డి, అంజనీకుమార్, దంగేటి సత్యనారాయణ, ఎస్‌వీ రమణ, సతీష్‌కుమార్ పాల్గొన్నారు. బలభద్రపురం శివారు కానేడులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులు ఫ్యాక్టరీ ముందు, బిక్కవోలు సిగరెట్ ఫ్యాక్టరీ వద్ద మేడే పతాకాలు ఎగురవేసి బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమను తిరిగి తెరిపించాలని డిమాండ్ చేశారు.



కోరుకొండలో మేడే వేడుకలు



బిక్కవోలులో ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నినాదాలు చేస్తున్న కార్మికులు



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

నిర్మాణాల నాణ్యతలో
ఎలాంటి రాజీపడొద్దు

దివాన్‌చెరువు, మే 1(ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వీసీ ఎస్. ప్రసన్నశ్రీ అధికారులకు సూచించారు. విశ్వ విద్యాలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న పరీక్షల భవనం, యూనివర్శిటీ కాలేజ్ ఇంజనీరింగ్ భవనాలను గురువారం ఆమె పరిశీలించారు. యూనివర్శిటీ ఇంజనీర్లు ఎప్పటికప్పుడు నిర్మాణ పనులు పరిశీలించాలని సూచించారు. రూ.8.25కోట్లతో ఎగ్జామినేషన్ భవనం, రూ.20.05 కోట్లతో యూనివర్శిటీ కాలేజ్ ఇంజనీరింగ్ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే విశ్వ విద్యాలయంలో భవనాల కొరత కొంతవరకు తీరుతుందన్నారు. ఈ రెండు భవనాల పనులు వేగంగా పూర్తిచేసి అప్పగించాలని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటలక్ష్మి

మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు

రాజానగరం, మే 1(ఆంధ్రజ్యోతి): బత్తుల బలరామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజానగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం జనసేన పార్టీ నా సేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకుని బాటసారులు, ప్రయాణికులు, వ్యాపారుల దాహార్తిని తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆమె పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

దామెర్ల గ్యాలరీలో ఉచిత
చిత్రలేఖన, చేతిరాత శిక్షణ


రాజమహేంద్రవరం కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మనం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ వద్దనున్న దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 1వ తేదీ నుంచి ఉచితంగా చిత్రలేఖన, చేతిరాత వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించినట్టు వ్యవస్థాపకుడు, కార్యదర్శి ఇజ్జిన వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎటువంటి వయోపరిమితి లేకుండా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఈ ఉచిత వేసవి శిక్షణా తరగతులు జరుగుతాయని, ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవిలో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



రంగంపేటలో ఉపాధిహామీ కూలీల మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సాయిబాబు

రంగంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని రంగంపేట ఎంపీడీవో సాయిబాబు తెలిపారు. గురువారం రంగంపేట గోపన్న చెరువులో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, తాగు నీరు వెంట తెచ్చుకోవాలన్నారు. ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా సురక్షబీమా చేయించుకోవాలన్నారు. ఇందుకోసం దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ తమ ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందించాలన్నారు. రూ.20 చెల్లిస్తే కూలీకి ప్రమాదం జరిగితే నామినికి 2 లక్షలు చెల్లిస్తారని, 436 రూపాయలు చెల్లిస్తే సాధారణ మరణంలో 2 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. ప్రతి ఇక్కరూ తప్పనిసరిగా సురక్ష బీమా చేయించాలని ఆయన సూచించారు. గోపన్న చెరువులో పనిచేస్తున్న 125 మంది కూలీల మస్తర్లను తనిఖీ చేశారు.



కదలాలి.. కార్మికా!





ఆయారే మేడే :రాజమహేంద్రవరంలో జెండా వందనం .. చిత్రంలో కార్మికులతో కలిసి ర్యాలీలో సీపీఐ నారాయణ

ఆయారే మేడే.. ఆయుధమై నేడే అంటూ కార్మికులు కదంతొక్కారు.. ఊరూవాడా నినాదాలతో మార్మోగిం చారు.. ప్రపంచ కార్మిక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.. కార్మికులంతా ఎర్రచొక్కాలు వేసుకుని.. ఎర్రజెండాలు పట్టుకుని కార్మికలోకం ఐక్యం కావాలి.. అనుకున్నది సాధించాలి... అందరూ కలిసి రావాలంటూ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.. జిల్లా లోని రాజమ హేంద్ర వరం, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు.

6

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.0 (గురువారం)

కనిష్ఠం : 26.0

8 మందికి డిప్యూటీ తహశీల్దార్లుగా పదోన్నతి

కలెక్టరేట్ (కాకినాడ), మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహశీల్దార్లుగా పదోన్నతి లభించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. పదోన్నతి పొందిన వారిలో పీబీఎస్‌వీ ప్రసాదరావు,ఎస్.కె పద్మవేణి, జి.ఫణీంద్ర రఘుపతిరావు,ఆర్‌టీటీ విజే సీతారామయ్య, జే.ధర్మేంద్ర, ఎం.సత్యవెంకటేష్, ఎం.దొరబాబు,బి.రేవతి ఉన్నారు.తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు.

ఆశలు.. గల్లాన్!



డీసీసీబీ పీఠం జనసేనదే..

- ఇంతకాలం టీడీపీకేనని నిర్ణయం
- చివర్లో అనూహ్య మార్పు
- పశ్చిమ డీసీసీబీ టీడీపీ..
- తూర్పు జనసేనకు పంపకాలు
- రెండ్రోజుల్లో అధికారిక ప్రకటన
- పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డికి ఛాన్స్!
- నిరాశలో టీడీపీ ఆశావహులు
- కోనసీమకు డీసీఎంఎస్ చైర్మన్
- ఇద్దరు టీడీపీ నేతల పరిశీలన

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవీ పంపకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఆఖర్లో అనూహ్యంగా ఈ కీలక పదవిని జనసేన ఎగరేసుకుపోయింది.ఈ కుర్చీ టీడీపీ తీసుకోవాలని తొలుత నిర్ణయం జరగ్గా ఆఖరి నిమిషంలో సమీకరణాలన్నీ మారిపోయాయి. టీడీపీకి బదులు జనసేనకు డీసీసీబీ ఇచ్చే యాలని నిర్ణయం జరిగింది. పశ్చిమ డీసీసీబీ టీడీపీ, తూర్పుగోదావరి డీసీసీబీ జనసేన తీసుకునేలా ఎట్టకేలకు నిర్ణయించారు. జనసేన నుంచి పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డికి పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.అటు చైర్మన్ కుర్చీ టీడీపీదేనని ఇంతకాలం భావించిన ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు. కాగా డీసీఎంఎస్ చైర్మన్ పదవికి కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఆఖర్లో అనూహ్యంగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ అంటే అదో హోదా. రాష్ట్రంలో అతిపెద్ద డీసీసీబీ తూర్పుగోదావరిదే. కూటమి అధికారంలోకి రావడంతో ఈ పదవి దక్కించుకోవాలని మూడు నెలలుగా అనేక మంది టీడీపీ నేతలు పావులు కదిపారు. ఉభయగోదావరి జిల్లాల నేతలు అధిష్ఠానం వద్ద పంచాయతీ పెట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు..తూర్పుగోదావరి టీడీపీకి ఇచ్చేలా కొంత కాలం కిందట నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు టీడీపీ ఆశావహులు తమ ప్రయత్నాలు ఆరంభించారు. ప్రధానంగా జడ్పీ చైర్మన్‌గా గతంలో పనిచేసిన జ్యోతుల నవీన్‌కు అవకాశం వస్తుందని ప్రచారం జరిగింది. కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ బాబి అయితే తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ రానందున డీసీసీబీ అయినా సాధించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వారి నుంచి లేఖలు సేకరించారు. కోనసీమ నుంచి మెట్ల రమణబాబు, మెట్ల నుంచి తోట నవీన్ తదితరులు ఆశలు పెంచుకున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు డీసీసీబీ నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ప్రకటించినప్పుడు ఆ జాబితాలో రెండు ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల చైర్మన్ల ప్రకటన వాయిదా పడింది. తీరా పశ్చిమ డీసీసీబీ జనసేనకు బదులు టీడీపీకి ఇవ్వాలనే ఒత్తిడి పెరగడంతో సమీకరణలు మార్చాల్సి వచ్చి ఉమ్మడి తూర్పు చైర్మన్ పేరు వాయిదా వేశారు. మూడు రోజు లుగా ఈ రెండు జిల్లాలకు సంబంధించిన టీడీపీ నేతలతో పార్టీ పెద్దలు అమరావతిలో చర్చలు జరిపారు. పశ్చిమ డీసీసీబీ కుర్చీ టీడీపీ తీసుకుని ఉమ్మడి తూర్పు కుర్చీని జనసేనకు కేటాయించాలని తీర్మానించారు.అనేక తర్జనభర్జనల తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి డీసీ సీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేయాలని టీడీపీ నిర్ణయించింది. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ఈసారికి డీసీసీబీ ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఇచ్చేలా అధిష్ఠానాన్ని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. తాజా నిర్ణయంపై టీడీపీలో కొందరు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధిష్ఠానం వద్ద ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇదే ఏకరువు పెట్టినా పొత్తు ధర్మం పాటించాల్సిందేనని అధిష్ఠానం తెగేసి చెప్పింది. ఆశావహులు తమకు అన్యా యం జరిగిందంటూ ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ ఎవరో..

డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేసిన నేపథ్యంలో డీసీఎంఎస్ చైర్మన్ పదవిని టీడీపీ తీసుకోవాల్సి ఉంది. దీంతో ఈ పదవికి టీడీపీ నుంచి ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ జనసేన, డీసీఎంఎస్ చైర్మన్ టీడీపీ తీసుకోవాలనే నిర్ణయం జరగడంతో ఉమ్మడి తూర్పులో డీసీసీబీ చైర్మన్ టీడీపీ, డీసీఎంఎస్ చైర్మన్ జనసేన నుంచి ఎంపిక చేయాల్సి ఉంది. కానీ ఆఖర్లో అన్నీ మారడంతో ఇప్పుడు టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌ను ఎంపిక చేయాల్సి ఉంది.దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు పార్టీ సీనియర్ నేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది.వీరిలో పెచ్చెట్టి చంద్రమౌళి,పెచ్చెట్టి విజయలక్ష్మి ఉన్నట్టు తెలిసింది.చంద్రమౌళి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాగా,విజయలక్ష్మి కోనసీమ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు.డీసీసీబీ చైర్మన్,డీసీఎంఎస్ చైర్మన్ పేర్లను రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ఆ కుర్చీ ఆయనకేనా..

డీసీసీబీ చైర్మన్‌గా పిఠాపురం ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పేరు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తారని ఎన్నికల ముందు ప్రకటించినప్పటి నుంచి మర్రెడ్డి పార్టీలో క్రియా శీలకంగా పనిచేస్తున్నారు. అంతకుముందు అనపర్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఈయన్ను పిఠాపురం తీసుకువచ్చారు.అప్పటి నుంచీ ఇప్పటి వరకు పిఠాపురం జనసేన పిఠాపురం ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.ఈ నేపథ్యంలో ఈయనకు పదవి ఇవ్వాలని నిర్ణయం జరిగినట్టు తెలిసింది. మరోపక్క మర్రెడ్డి తర్వాత పార్టీలో చేరిన తోట సుధీర్‌కు ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబుకు కుడా చైర్మన్ పదవి ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వేముల పాటి అజయ్‌కు టిడ్కో చైర్మన్, హరిప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా తరపున మర్రెడ్డి పేరు తర్వాత లిస్టులో ఉండడంతో ఇప్పుడు ఈయనకు డీసీసీబీ పదవి కట్ట బెట్టాలని పార్టీ యోచిస్తోంది.కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారు శ్రీనివాస్ పేరు ప్రచారంలోకి వస్తున్నా మర్రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.మర్రెడ్డిని డీసీసీబీ చైర్మన్‌గా పంపి ఎమ్మెల్సీ నాగబాబును పిఠాపురం ఇన్‌చా ర్జిగా నియమిస్తారనే చర్చ జనసేనలో జరుగుతోంది.

రహదారులు.. బాగు..బాగు!


బీటీ రోడ్డుగా చెందుర్తి- తాటిపర్తి రహదారి

పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం

- ఉమ్మడి జిల్లాలో 29 రోడ్ల అభివృద్ధి
- రూ.73.15 కోట్లు విడుదల
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల
- టెండర్లు పిలవాలని ఆదేశం
- 9 నెలలే నిర్మాణ గడువు
- నాబార్డు-ఆర్‌ఐడీఎఫ్ రుణం
- ప్రభుత్వ వాటా నిధులు విడుదల

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ప్రభుత్వం మారింది..రోడ్లకు మహర్దశ పట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డెక్కితేనే నరక యాతన.. ప్రస్తుతం ఎక్కడికక్కడ రహదారులు వేస్తున్నారు.. దీంతో ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం లభించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస నిర్వహణకు నోచుకోని రోడ్ల అభివృద్ధికి పుష్కలంగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాబార్డు -ఆర్‌ఐడీఎఫ్ రుణం, ప్రభుత్వ వాటాతో కలిపి ఉమ్మడి జిల్లాలో 29 రహదారులకు రూ.73.15 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో తక్షణం పనులు ప్రారంభించేందుకు వీలుగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ అధీనంలో ఉన్న గ్రామీణ ప్రాంత రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్ల అభివృద్ధితో పాటు గ్రావెల్, మెటల్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు వేసేందుకు ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించారు.

నాబార్డు దారిచూపుతోంది..

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి నాబార్డు ప్రతి ఏటా రుణం మంజూరు చేస్తుంది. దీనికి ప్రభుత్వం 33 శాతం వాటా నిధులను సమకూర్చాల్సి ఉంటుంది.రుణంతో పాటు ప్రభుత్వం నిధులు కలిపి రోడ్ల అభివృద్ధికి కేటాయిస్తుంది. ఈ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో నాబార్డు రుణాన్ని మంజూరు చేసింది. ఆర్థిక సంవత్సరం మొదలైన నెల వ్యవధిలో ఈ నిధులతో చేపట్టే పనులకు ప్రభుత్వం అనుమతులిస్తూ జీవో జారీ చేసింది. తక్షణం టెండర్లు పిలిచి ఆరు నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించింది.వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి నాబార్డు-ఆర్‌ఐడీఎఫ్ కింద రుణం మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడం, విడుదల చేస్తామని నాబార్డు రుణాన్ని తీసుకుని ఇతర పథకాలకు మళ్లించడం చేసింది.దీంతో ఐదేళ్ల కాలంలో ఒక పనిని పూర్తి చేయలేకపోయారు.

కాకినాడ జిల్లాలో..

జిల్లాలో 14 పీఆర్‌రహదారులకు రూ.28.10 కోట్లు కేటాయించారు.జగ్గంపేట నియోజకవర్గం మామిడాడ-అప్పన్నపాలెం రహదారికి రూ.1.20 కోట్లు, కాకినాడరూరల్‌లో కేఎస్‌ఎఫ్ రోడ్డు-యండమూరు -సిరిపురం-అడ్డతూము రోడ్డుకు రూ.2 కోట్లు, వేళంగి-సిరిపురం -తాటిపల్లి జంక్షన్ రోడ్డుకు రూ.1.70 కోట్లు, పెద్దాపురం అసెంబ్లీ ఆర్‌బీ కొత్తూరు-వేట్లపాలెం రోడ్డుకు రూ.1.80 కోట్లు, పులిమేరు-విరవ రోడ్డుకు రూ.1.65 కోట్లు, పిఠాపురం అసెంబ్లీ చెందుర్తి-తాటిపర్తి రోడ్డుకు రూ.1.80 కోట్లు, ఏకే మల్లవరం-ఉప్పరగూడెం రోడ్డుకు రూ.4 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కందరాడ వరకు రూ.55 లక్షలు,పిఠాపురం-సామర్లకోట రోడ్డు-గోవిందరాజులపాలెం- మల్లాం రోడ్డుకు రూ.1.40 కోట్లు,వెల్దుర్తి-ధర్మవరం రోడ్డు నుంచి పి.దొంతమూరు-పి.రాయవరం వరకు రూ.2 కోట్లు,నాగులాపల్లి-సీతానగరం-చేబ్రోలు రోడ్డుకు రూ.1.20 కోట్లు,ప్రత్తిపాడు అసెంబ్లీ లింగంపర్తి-కొండతిమ్మాపురం రోడ్డు రూ.3 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ కాకినాడ-కోటిపల్లి రోడ్డు నుంచి శలపాకకు రూ.2.80 కోట్లు, తుని అసెంబ్లీ కృష్ణాపురం నుంచి యల్లయ్యపేటరోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో 13 రహదారుల అభివృద్ధికి రూ.24.62 కోట్లు కేటాయించారు. అనపర్తి నియోజకవర్గం దుప్పలపూడి నుంచి కాపవరం రోడ్డుకు రూ.2 కోట్లు, మర్రిపూడి నుంచి ఆర్‌బీపట్నం రోడ్డుకు రూ.1.20 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలో కరిచర్లగూడెం నుంచి సంజీవపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు, చోడవరం-గుండేపల్లి రోడ్డుకు రూ.1.80 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం-ఆర్.ఎ ర్రంపాలెం రోడ్డుకు రూ.1.50 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో పెనకనపెట్ట-కుమారదేవం రోడ్డుకు రూ.2.70 కోట్లు, నిడదవోలు నియోజకవర్గంలో సింగవరం-నందమూరు రోడ్డుకు రూ.1.47 కోట్లు, కానూరు-నడుపల్లికోట రోడ్డుకు రూ.1.50 కోట్లు, ఎన్‌హెచ్-16-కొత్తపల్లి అగ్రహారం-కాపవరం రోడ్డుకు రూ.1.70 కోట్లు, పైడిపర్రు-సత్యవాడ రోడ్డుకు రూ.2.70 కోట్లు, రాజమహేంద్రవరం రూరల్‌లో జేగురుపాడు బ్రిడ్జి-కడియపుసావరం-కడియం బ్రిడ్జి రోడ్డుకు రూ.2.60 కోట్లు, కాతేరు నుంచి బాతింగ్ ఘాట్ వరకు రూ.60 లక్షలు, రాజానగరం నియోజకవర్గం సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకు రోడ్డుకు రూ.3.25 కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 రహదారులకు రూ.20.43 కోట్లు కేటాయించారు. అమలాపురం అసెంబ్లీ సిరిపల్లి-మునిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు-ఉప్పలగుప్తం-పేరయ్యచెరువు రోడ్డుకు రూ.3 కోట్లు, కొత్తపేట అసెంబ్లీ అమలాపురం-రావులపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మోడేకుర్రు వరకు రూ.1.45 కోట్లు, మడికి-చిలకలపాడుకు రూ.1.14 కోట్లు, మండపేట అసెంబ్లీ ఆర్‌సీపురం-నదురుబాద- పీవీ రోడ్డుకు రూ.3.30 కోట్లు, ముమ్మిడివరం అసెంబ్లీ ఐ.పోలవరం-కేశనకుర్రు రోడ్డుకు రూ.1.95 కోట్లు,ముమ్మిడివరం-కొత్తలంక రోడ్డు నుంచి పచ్చమట్లవారిపాలెం వరకు రూ.1.32 కోట్లు, పి.గన్నవరం అసెంబ్లీ నల్లచెరువు-పెండాల్యచెరువు రోడ్డుకు రూ.65 లక్షలు, అవిడి-మాచవరం టూ ఇసుకపూడి వరకు రూ.1.25 కోట్లు, అమలాపురం బొబ్బర్లంక,గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్ల మధ్య వయా కొర్లపాటివారిపాలెం రోడ్డుకు 1.10 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ ద్రాక్షారామ-ఆదివారపుపేట-వెల్ల రోడ్డుకు రూ.2.72 కోట్లు, రాజోలు అసెంబ్లీ గొల్లపాలెం బ్రిడ్జి నుంచి కాట్రేనిపాడు రోడ్డు వరకు రూ.1.27 కోట్లు, పొన్నమండ-కాట్రేనిపాడు రోడ్డుకు రూ.1.28 కోట్లు నిధులు కేటాయించారు.

8 నుంచి తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



గోకవరం, మే1 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. గోకవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపించేందుకు దేవస్థానంపై పలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.కళ్యాణ మహోత్సవాలు జరుగు ఐదు రోజుల పాటు భక్తులకు ఉచిత అన్నదానం కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. కావున భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వీయ ధ్రువీకరణతో భవన నిర్మాణ అనుమతులు

కొవ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : స్వీయ ధ్రువీకరణ పత్రం అందించి ప్రజలు సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చునని కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 ఫిబ్రవరి 4వ తేదీన జీవో ఎం.ఎస్ నంబరు 20 విడుదల చేసిందన్నారు. జీవో నంబరు 20పై మార్గ దర్శకాలను తెలియజేయడానికి మునిసిపల్ పట్టణ ప్రణాళికా విభాగంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో 94.68% పింఛన్ల పంపిణీ


మహిళకు పింఛను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లా ఈసారి 8వ స్థానంలో నిలిచింది. గురువారం ఒక్క రోజులో సాయంత్రం 7 గంటల సమయానికి 94.68% పంపిణీ పూర్తయిందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పేర్కొన్నారు.రాజమహేంద్రవరంరూరల్ మండలం పరిధి హుకుంపేటలో చామకూరి నారాయణ స్వామికి (బెడ్ రీడెన్స్) వృద్ధాప్య పింఛను, బెజవాడ సత్యనారాయణకు దివ్యాంగ పింఛను,మానేపల్లి జయకు వితంతు పింఛను కలెక్టర్ ప్రశాంతి అందజేశారు.ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,34,576 లబ్ధిదారులు ఉండగా 2,22,095 మందికి రూ.96,43,05,500 అందజేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం సమయానికే 91 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మొదటి మూడు స్థానాల్లో రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ, చాగల్లు మండలాలు ఉన్నాయని, చివరి స్థానంలో కొవ్వూరు అర్బన్ ఉందన్నారు. ముందస్తు కసరత్తు, పకడ్బందీ ఏర్పాట్ల వల్ల ప్రతి నెలా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పింఛన్ల పంపిణీలో మంచి ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లా డుతూ భర్త చనిపోతే వారి పింఛను భార్యకు బదిలీ చేస్తూ ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష 60 వేలమందికి అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 13 రకాల పింఛన్లు 60 లక్షల మందికి అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, మత్స్యేటి ప్రసాద్, బొప్ప న నాగేశ్వరరావు, కోరాడ వెంకటేష్, మట్ట శ్రీను, మరుకుర్తి వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకా ధికారి జ్యోతి, ఎంపిడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, కార్యదర్శులు సూరిబాబు, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పని!


చెరువు వద్ద పరిశీలిస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్


ప్రశాంత్ మృతదేహం

గోపాలపురం, మే1 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుకు నీళ్లతోడుతున్న విద్యుత్ మోటార్ తగిలి ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. విజయనగరం జిల్లా డాగలగూడకు చెందిన బి.ప్రశాంత్ (21) వెంకటాయపాలెం గ్రామ శివారులో సుంకవల్లి భగవాన్‌దాస్‌కు చెందిన వెంకటేశ్వర ఆక్వా ఫామ్స్‌లో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా గురువారం నీరుతోడుతున్న విద్యుత్ మోటారుకు తగిలి కింద పడిపోయాడు. గమనించిన యాజమాన్యం ప్రశాం త్‌ను వెంటనే గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ప్రశాంత్ చనిపోయినట్టు డ్యూటీ డాక్టర్ వివరించినట్టు సూపరింటెండెంట్ చైతన్య తెలిపారు. ఆసుపత్రికి వచ్చే సమయానికి సుమారు 30 నిమిషాలు ముందే చనిపోయినట్టు తెలిపారు. మృతుడు కుటుంబసభ్యులెవరు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు. కుటుంబ సభులు ఫిర్యా దు చేస్తే కేసు నమోదు చేస్తానని ఎస్ఐ తెలిపారు. యువ కుడి మృతిపై అటు విద్యుత్ అధికారులుకానీ, ఇటు పోలీ సులు అధికారులు కానీ సరైన రీతిలో స్పం దించలేదని స్థానికులు చెబుతున్నారు.


వీసీలో అధికారులతో కలెక్టర్ సమీక్ష

4న 'నీట్' నిర్వహణ

రాజమహేంద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) -2025కి విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొ న్నారు.జేసీ చిన్న రాముడుతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని 8 కేంద్రాల్లో 2,760 మంది అభ్యర్థులు నీట్ రాస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల రవాణాకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ నెల 3,4 తేదీల్లో పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు మూ సివేయాలని ఆదేశించామన్నారు. అన్ని బస్‌స్టేషన్ల నుంచి ఆయా పరీక్షా కేంద్రా లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ ప్రత్యేక బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కా ర్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సి పాల్ జి.విజయలక్ష్మి, అదనపు ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 390 బస్‌లు

- కృష్ణానది ఉత్తర భాగాన పీ11లో పార్కింగ్
- సిద్ధార్థ మెడికల్ కళాశాలలో భోజనాలు
- సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పునఃప్రారంభించడానికి ఈ నెల 2న(శుక్రవా రం) అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న విషయం తెలిసిందే..ఈ సభకు జిల్లా నుంచి బయలుదేరి వెళ్లే వాహనాలకు కృష్ణా నది ఉత్తర భాగాన ఉన్న ప్రదేశంలో పార్కింగ్ స్థలాన్ని(నెం. పి11) కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమె పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తూర్పు, ఉత్త రాంధ్ర జిల్లాల నుంచి వెళుతున్న 390 బస్సు లు రూట్ నెం.3 ద్వారా వెళ్లాలన్నారు. ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన సూచన బోర్డులను అనుసరించాలని చెప్పారు. ప్రతి బస్సులో ఒక పర్యవేక్షణ ఉద్యోగి ఉంటారని, రూట్ మ్యాప్‌పై వారు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు.ఎలాంటి సందేహం ఉన్నా కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలన్నారు. ప్రజలు ఇబ్బం ది పడకుండా అవగాహన కల్పించడం, బృందాలుగా సభకు వెళ్లడం, తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరుకోవడంలో టీం లీడర్లు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. గన్నవరం సమీపంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఇటువైపు నుంచి వెళ్లే వారికి భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నాయక్, శ్రీనివాస్ పర్యవేక్షణ చేస్తారన్నారు.


దేవరపల్లిలో మేడే జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, సభ్యులు


దేవరపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు

జయహో కార్మిక!

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- పలుచోట్ల అరుణ పతాకం ఆవిష్కరణ
- కార్మిక సంఘాల ర్యాలీలు
- కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి
- 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ


కొవ్వూరులో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే)ను పలుచోట్ల గురువారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లోని భవన నిర్మాణ కార్మికులకు మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికులకు ముందుగా అదనపు జిల్లా జడ్జి అనురాధ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ తాను కూడా 2008 మే 1న జ్యూడీషియల్ సర్వీసెస్‌లోకి రావడానికి ప్రమాణం చేసి వచ్చానన్నారు. కార్మికులు శారీరకంగాను, ఉద్యోగులు మానసికంగాను కష్టపడతారన్నారు. ఏదేమైనప్పటికీ అందరం ప్రపంచ పునఃనిర్మాణానికి ఎవరి స్థాయిలో వారు సాయం అందజేస్తున్నారన్నారు. ఈ నెల 1 నుంచి వారం రోజుల పాటు న్యాయసేవలు, కార్మికుల హక్కులు, కార్మిక చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్వీ మునీంద్ర, ఎన్‌బీ కాంతిదర్, ఎం.శ్రీవల్లీ, లేబర్ ఆఫీసర్ సులోచన, నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు. మండలంలోని విజ్జేశ్వరం సెంటర్లో విజయదుర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్మన రాముడు, కార్యదర్శి మారెళ్ల శ్రీను జెండా ఆవిష్కరించారు. వాడపల్లిలో గోదావరి గట్టుపై శ్రీకృష్ణ చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీరా త్రిమూర్తులు, అయినవిల్లి డేవిడ్ జెండా ఆవిష్కరించి మే డే వేడుకలు నిర్వహించారు. శ్రీనివాసపురంలో వినాయక కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు వల్లేపు రాంబాబు, పోతురాజు, కోరమండల్ స్లీపర్ కంపెనీ వద్ద యూనియన్ కార్యదర్శి బీరా రవి, టి.పాపారాయుడు, పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద సాయి గణేష్ పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గోసాల శ్రీను, సిద్దిరెడ్డి బాపిరాజు, బాపూజీ, కూరగాయల మార్కెట్ వద్ద బజారు జట్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.వీరబాబు, కె.కనకారావు, బుద్ధుడి విగ్రహం వద్ద హమాలీ కార్మికుడు సాజిపల్లి పెంటయ్య, బస్టాండ్ సెంటర్ చైతన్య తాపీవర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మైగాపుల నాగేశ్వరరావు, బస్టాండ్ గ్యారేజ్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని అల్లూరి



మే డే వేడుకల్లో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు

సీతారామరాజు విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మద్దుకూరి దొరయ్య అధ్యక్షతన కార్మికుల సభ నిర్వహించారు. సుందరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఉన్న కార్మిక చట్టాలను విస్మరించి కార్పొరేట్లకు, పెట్టుబడిదార్లకు అనుకూలంగా తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులంతా ఐక్య గా ఉద్యమించాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ, కార్మిక శాఖ అధికారి అలోచనకు కార్మికులు తమ సమస్యలను తెలియజేశారు. ఆరు సంవత్సరాలుగా కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు కావడం లేదని, ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చట్టాన్ని, కార్మికుల నిధులను సక్రమంగా ఖర్చు చేయడం లేదన్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలోను, హౌస్‌మేట్స్‌తో ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. చికాగో అమర వీరులకు జోహార్లు అర్పించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు ప్రత్యేక రక్షణ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వి.భవాని, సాయి, ఐఎఫ్‌టీయూ నాయకుడు శ్రీను, రాజు, పీడీ ఎస్‌యూ నాయకుడు నంబూరి మహర్షి పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి చీర అప్పారావు జెండా ఆవిష్కరించారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద గోదావరి మాత మెకానికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.చంద్రరావు, రామారావు ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు: నిడదవోలులో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రేఖా భాస్కరరావు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని కోసం జరిగిన పోరాటంలో పాలకులు జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిచినదే ఈ ఎర్రజెండా అని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు పోరాటం ఒక్కటే మార్గమని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తరువాత కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం 4 కోడ్‌ల లోకి మార్చడానికి పూనుకుందని ఇప్పటికే 29 చట్టాలను రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణతో దేశ సంపదను కార్పొరేటర్లకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. పట్టణంలో కార్మిక సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముందు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్మన్ మే డే సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో మాముడూరి నాగేంద్ర వరప్రసాద్, ఎ.నరసింహారావు, క్రొవ్విడి నాగరాజు, గన్నాబత్తుల సత్యనారాయణ, మొయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బేజా అప్పారావు, కోసూరి శ్రీను పాల్గొన్నారు. నిడదవోలులోని యర్నగూడెం రోడ్డులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో చేతికర్ర నాటకం ద్వారా కార్మిక వర్గానికి కార్మిక సంఘం అండగా ఉండాలన్న సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్, తీపర్తి వీర్రాజు, పామర్తి సత్యనారాయణ, ఖండవల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు భాస్కరరావు

చాగల్లు: చాగల్లులో సీపీఎం నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ కార్యదర్శి కామిశెట్టి దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు కె.పోశమ్మ మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు.



చాగల్లులో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

కార్యక్రమంలో కె.తతారావు, టి.కొండయ్య, జీవీ సుబ్బారావు, ఎస్‌కే ఆదాం, కంకటాల బుద్ధుడు, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక బాట్లింగ్ యూనిట్ వద్ద జరిగిన మే డే కార్యక్రమంలో బొల్లిపో ప్రసాద్, బొల్లిపో రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఊనగట్ల సెంటర్‌లో సీపీఎం నాయకుడు గంటి కృష్ణ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

దేవరపల్లి: మండలంలోని చిన్నాయిగూడెం, దేవరపల్లి, దుద్దుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో మేడే జెండాలు ఆవిష్కరించి మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే.మస్తాన్, సీఐటీయూ నాయకుడు ఎస్.భగత్ మాట్లాడుతూ 8గంటల పని విధానం, కార్మిక చట్టాలను కాపాడుకోవడమే ప్రస్తుతం కార్మికుల ప్రధాన కర్తవ్యమని అన్నారు. కేం ద్రంలో బీజేపీ తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలన్నీ అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండ, సహజ వనరులపై జరుగుతున్న దోపిడీని ఆపాలని, కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో వివిధ కార్మిక సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, పిన్నమనేని సత్యనారాయణ, కొత్తగుండి రత్నాజీ, ఆచంట సత్యనారాయణ, టేకుమూడి శంకరయ్య, ఆకాశ్ సత్యనారాయణ, శామ్యూల్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో సీఐటీయూ అనుబంధ సంస్థలైన తాపీ పనివార్ల సంఘం, ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకలకు యూటీఎఫ్ జిల్లా నాయకుడు జయకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్మికుల పోరాటాల ద్వారా రోజుకు 8 గంటల పనిదినాలను సాధించుకున్న నేపథ్యంలో చేపట్టే ఉత్సవమే మే డే అని పేర్కొన్నారు. తాళ్లపూడి పంచాయతీ ఎదురుగా, బస్టాండ్ ఆవరణలో మాజీ సర్పంచ్ నామాన పరమేశ్వరరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైసుమిల్లు సెంటర్


తాడిపర్రులో బీమా కార్డులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం నాయకులు జేవీ కుమారి, తాపీ వర్కర్స్ సంఘం నాయకులు దూళ్ల గోపాలరావు, ఉప్పే కేదారేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.నరసింహమూర్తి పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో జన్నేపల్లి నాగరాజు పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం కేక్‌ను కట్ చేశారు. కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరారు. ఉపాధ్యక్షుడు దేవన సత్యనారాయణ, బల్లే శ్రీను, ఆకుల కృష్ణ, దూసనపూడి వెంకటేష్, ఉరకొండి శ్రీను, కర్రి నాగరాజు, తైలం రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో సిద్ధి వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే జరిపారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు భవన నిర్మాణ కార్మికులకు బీమాకార్డులు అందజేశారు. ఉండ్రాజవరం, మోర్త, వేలివెన్ను గ్రామాల్లో కార్మికులు జెండాలు ఎగురవేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ ఫెడరేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు గుండుమేని జగన్నాథం, కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సామాజిక పింఛన్లు
ఎమ్మెల్యే ముప్పిడి


పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరులోని 6వ వార్డు పాతూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలో 3889 మందికి గాను 3597 మంది(92.49 శాతం)కి పంపిణీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. అలాగే కొవ్వూరు మండలంలోని 16 గ్రామాల్లో 9976 మంది పింఛనుదారులుండగా 9353 మంది (93.80 శాతం)కి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఇంచార్జి ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, వేమగిరి వెంకట్రావు, కె.సత్యేంద్ర, సుంకర సత్తిబాబు, గంగుమళ్ళ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం

కొవ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి అన్నపూర్ణ పథకంలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, మదర్‌థెరిస్సా హోంలోని విద్యార్థులకు గురువారం అన్నదానం చేశారు. అలాగే మెరకవీధిలో డొక్కా సీతమ్మ చలివేంద్రం వద్ద పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.లయన్స్‌క్లబ్ జిల్లా గ్లోబల్ యాక్షన్ టీం మార్కెటింగ్ కోఆర్డినేటర్ పాలింపాటి చినబాబుచౌదరి పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, సభ్యులు కంఠమణి కిషోర్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పెనుమాక జయరాజు, కలగర ఏడుకొండలు, మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నీతి కథలు పుస్తక పఠనం
వేసవి విజ్ఞాన తరగతులు


చంద్రవరం లైబ్రరీలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

చాగల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా మెదడుకు పదును పెట్టవచ్చునని ఉపాధ్యాయుడు నెక్కంటి శ్రీనివాస్ అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం చంద్రవరం శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు నీతి కథల పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. కథలు చదివించడం, రాయించడం, చెప్పించడం నేర్పించారు. విద్యార్థులకు సులభంగా ఆంగ్లంలో మాట్లాడడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ కాసాని వెంకటేశ్వరరావు, లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, మే 1(ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతయిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కొవ్వూరుకు చెందిన కోట్ల సత్యనారాయణ(77) ఏప్రిల్ 30న ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రోడ్డు కం రైలు బ్రిడ్జి 159వ స్తంభం వద్ద చొక్కా, లుంగీ వదిలిపెట్టి బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం ఎరినమ్మ ఘాట్ ఇసుక ర్యాంపు సమీపంలో మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా సత్యనారాయణ కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని పేర్కొన్నారు. మృతుడి మనుమడు ఎస్.రేవంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

'గోదావరిలో మృతదేహం' ఆచూకీ లభ్యం
మృతుడు కృష్ణా జిల్లా కవులూరు వాసి

కొవ్వూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో గోదావరిలో గుర్తించిన మృతదేహం కృష్ణా జిల్లా కవులూరుకు చెందిన వెంపాటి నాగరాజు(51)గా గుర్తించినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఏప్రిల్ 30న ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులో పోలీసులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఇటీవల జిల్లాలో నమోదయిన మిస్సింగ్ కేసులను పరిశీలించగా మృతుడు కృష్ణా జిల్లా కవులూరుకు చెందిన వెంపాటి నాగరాజు (51)గా గుర్తించారు. నాగరాజు కొంతకాలంగా రాజమహేంద్రవరంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతడు కనిపించడం లేదని ఏప్రిల్ 28న బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదయ్యిందన్నారు. దాని ఆధారంగా బంధువులకు సమాచారం అందించగా గురువారం మృతదేహాన్ని పరిశీలించి నాగరాజుగా గుర్తించినట్టు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి
మరొకరికి తీవ్ర గాయాలు
ఆసుపత్రికి తరలింపు

కొవ్వూరు, మే 1(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన మునుపాటి శ్యామ్యూల్(35), అతడి కుమారుడు నాగరాజు కలిసి ఏప్రిల్ 30న రాజమహేంద్రవరంల సమీపంలోని దివాన్‌చెరువు వెళ్లి పందిని కొనుగోలు చేసి బైక్‌పై తిరిగి వస్తున్నారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్ ప్లాజా సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిన శామ్యూల్ అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజుకు కుడిచేతికి, రెండు మోకాళ్ళకు, తీవ్రగాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

గోపాలపురం, మే 1(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమోలు గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఏప్రిల్ 30వ తేదీ తెల్లవారు జామున తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి వద్ద నుంచి బయల్దేరి వెళ్లినట్టు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96665కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ చెప్పారు.

ప్రధాని మోదీది విభజించి-పాలించు విధానం

- ప్రధానికి ఎన్నికలపై ఉన్న ప్రేమ దేశభద్రతపై లేదు
- ఎర్ర జెండాకు కాలం చెల్లలేదు.. ఇంకా ఎరుపెక్కుతూనే ఉంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి రాష్ట్రాల ఎన్నికలపై ఉన్న ప్రేమ దేశభద్రతపై లేదని, కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేయాలనుకోవడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కులాలు మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలన చేస్తున్నారని ఆరోపించారు. గురువారం సీపీఐ జట్ల లేబర్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన మేడే వేడుకల్లో నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మీడియాతోను, అనంతరం ఆవరోడ్డులో జరిగిన బహిరంగ సభలోనూ నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ 2వ తేదీన అమరావతి వస్తున్న సందర్భంగా ప్రధాని సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మీసం మెలేసి అమరావతి పునర్నిర్మాణం జరిగేలా మాట్లాడాలన్నారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాము నమ్ముతున్నామని, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక హోదా కోసం ప్రధానిని ప్రశ్నించాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అమరావతిని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మోదీ పక్షంగానే మారిపోయాయన్నారు. కార్మిక చట్టాల రద్దుతో కార్మికుల అన్ని హక్కులు కాలరాస్తున్నారని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైతే బానిస బతుకులు సాగిస్తున్నారన్నారు. సెప్టెంబరులో సీపీఐ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో జరుగుతాయని, ఇండియా కూటమిని బలోపేతం చేసే దిశగా ఈ సభల్లో చర్చిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళపై బీజేపీ వాళ్లు కోడిగుడ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎర్రజెండాకు కాలం చెల్లలేదని, ఇంకా ఎరుపెక్కుతూనే ఉవదని, దోపిడీ ఉన్నంతవరకూ ఎర్రజెండా బతికే ఉంటుందని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన భూములను అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతి కార్మికుడు పోరాడాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినం, ఉద్యోగ భద్రత కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలన్నారు. జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి టీవీవీ కొండలరావు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్ప రమణ, చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి సభావేదిక వరకూ ప్రదర్శన నిర్వహించారు. పలుచోట్ల పతాకాలను ఆవిష్కరించారు.


సభలో ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

బహమాస్ సదస్సులో పాల్గొనడం అదృష్టం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): బహమాస్ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందని జాతీయ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విభిన్న రాష్ట్రాలు, వివిధ రాజకీయపార్టీలకు చెందిన సభ్యులతో కూడిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సాధికారత అంశాలపై ప్రయోజనాత్మక చర్చల్లో పాల్గొనడం ఓ గొప్ప అనుభవంగా నిలిచిందని తెలిపారు. కాగా, పురంధేశ్వరి మే 5న బహమాస్ నుంచి తిరిగి ప్రయాణం కానున్నారు.

ప్రధాని మోదీ విచ్చేస్తుండడం హర్షణీయం... ప్రజారాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేందుకు మే 2న ప్రధాని మోదీ విచ్చేస్తుండడం పట్ల ఎంపీ పురంధేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

సింహాచలం ఘటనపై దిగ్భ్రాంతి... సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవంలో గోడకూలి భక్తులు మరణించిన ఘటనపై ఎంపీ పురంధేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బైక్‌పై చెట్టు విరిగి పడి వ్యక్తి మృతి
మరొకరికి గాయాలు
ఆసుపత్రికి తరలింపు

కొవ్వూరు, మే 1(ఆంధ్రజ్యోతి): బైక్‌పై చెట్టు విరిగి పడి ఓ వ్యక్తి మృతిచెందినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన చిన్నం రవికుమార్, అత్తిలి ధనరాజు ఏప్రిల్ 30న రాజమహేంద్రవరం పనికి వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా గాలి దుమ్ముకు డీఏవీ స్కూల్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి బైక్‌పై పడింది. ఈ ప్రమాదంలో రవికుమార్ (46) మృతిచెందగా, ధనరాజుకు గాయాల య్యాయి. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని కొవ్వూ రు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చిన్నం అభిషేక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కాంగ్రెస్.. డ్రైవర్లకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే) సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న కొందరు డ్రైవర్లకు పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి రూ.10 లక్షల పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించారు. గురువారం మునిసిపల్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మే డే వేడుకల్లో తొలుత ఏపీ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ)రాష్ట్ర అధ్యక్షుడు కేవీ కృష్ణారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జేటి రామారావు లతో కలిసి జెండాను ఎగురవేసి అటుపై టీకే సొంత ఖర్చులతో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ చేయించారు. అసంఘటిత కార్మికులు బట్టలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా బలోపేతం చేసి కార్మికులకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పోరాడుతుందని అన్నారు.

దామెర్లలో ఉచిత చిత్రలేఖన, చేతిరాత శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మనం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ వద్దనున్న దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 1వ తేదీ నుంచి ఉచితంగా చిత్రలేఖన, చేతిరాత వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించినట్టు వ్యవస్థాపకుడు, కార్యదర్శి ఇజ్జిన వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎటువంటి వయోపరిమితి లేకుండా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఈ ఉచిత వేసవి శిక్షణా తరగతులు జరుగుతాయని, ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఆర్‌ఎం అకాడమీ కార్యదర్శి పీవీఎస్ కృష్ణారావు మాట్లాడుతూ పిల్లలు ఈ చిత్రకళ ద్వారా వికాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. మనం ఆర్ట్స్ అకాడమీ ప్రెసిడెంట్ ఇజ్జిన నవీనకుమారి వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో మనం అకాడమీ మెంబర్ కేఎస్ స్వామి, కేర్‌టేకర్ ఎం.ఆదిలక్ష్మి, సూర్యనారాయణ, ఆర్ట్ గ్యాలరీ రిటైర్డ్ సిబ్బంది పి.వీరభద్రరావు, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.